ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

3

శుక్రవారం 7 నవంబరు 2025





పూలచాదర్ తీసుకెళుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

మదనపల్లె జిల్లాకు పచ్చ జెండా..

- మంత్రుల సబ్ కమిటీ స్పష్టత
- త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి
- క్షేత్ర స్థాయిలో అధికారులు సిద్ధం
- రికార్డుల విభజన పూర్తి
- నెరవేరనున్న ఎన్నికల హామీ

రాయచోటి/మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఒక రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మదనపల్లె త్వరలోనే జిల్లాగా ఏర్పడనుందా? అంటే గత కొన్ని రోజులుగా జరుగుతున్న కొన్ని పరిణామాలను గమనిస్తే.. వాస్తవమే అనిపిస్తోంది. దీనికి బలం చేకూర్చేలా బుధవారం విజయవాడలో జరిగిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు కోసం నియమించబడ్డ మంత్రుల సబ్ కమిటీ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రజెంటేషన్ ఇవ్వడంతో పాటు సబ్‌కమిటీలోని మంత్రులు సైతం కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను తమ సబ్ కమిటీ పరిశీలించి ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో చాపకింద నీరులా సుమారు మూడు నెలలుగా మదనపల్లె జిల్లాకు సంబంధించి అవసరమైన ప్రక్రియ మొత్తం స్థానిక అధికారులు పూర్తి చేశారు.

చిరకాల కోరిక.. పాలనా సౌలభ్యం

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పలు జిల్లాలను విభజించి కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ విభజనలో హేతుబద్ధత లేదని, విభజన సక్రమంగా జరగలేదని పలుచోట్ల ప్రజలు ఆందోళనలు చేశారు. జిల్లాకు, నియోజకవర్గాలకు, మండలాలకు సంబంధం లేకుండా ప్రకటించారు. కొన్నిచోట్ల రెండు మండలాలు ఒక జిల్లాలో, మరో నాలుగు మండలాలు మరో జిల్లాలో ఉన్నాయి. ప్రజలకు ఎంతో దూరంగా రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేశారు. ప్రజల ఆందోళన, అసంతృప్తిని గుర్తించిన తెలుగుదేశం పార్టీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము అధికారంలోకి వస్తే నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల హామీలో పేర్కొంది. ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ఈ ప్రజల చిరకాల కోరికను గౌరవించి జిల్లా కేంద్రాన్ని మదనపల్లెలో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా యువగళం పాదయాత్ర సందర్భంగా ఇక్కడికి వచ్చిన నారా లోకేశ్ సైతం తాము అధికారంలోకి వస్తే మదనపల్లె జిల్లాను ప్రకటిస్తామని ప్రకటించారు. అనుకున్నట్లే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్ వ్యవస్థీకరణ కోసం రాష్ట్ర మంత్రులతో ఒక ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ సబ్ కమిటీ రాష్ట్రంలోని ప్రజల అభిప్రాయాలు, వినతులను స్వీకరించి కొత్తగా ఏర్పాటు చేయవలసిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లపై అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా బుధవారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వచ్చిన ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలు, శాఖాపరమైన సూచనలపై సీసీఎల్ఏ రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కొత్తగా మదనపల్లె, మార్కాపురం జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించారు. దీంతో ఇక మదనపల్లె జిల్లా ఏర్పాటు లాంఛనమే అని అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

చాపకింద నీరులా ఏర్పాట్లు

దాదాపు రెండు నెలలుగా చాపకింద నీరులా ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు జిల్లా ఏర్పాటు ప్రక్రియకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలతో కూడిన 'మదనపల్లె జిల్లా' పేరుతో మ్యాపును సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. మదనపల్లె జిల్లాలో ఉంటాయనే ప్రచారంలో ఉన్న పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన అన్ని శాఖల రికార్డులను విభజన చేశారు. రాష్ట్ర స్థాయి అధికారులు మదనపల్లెకు వచ్చి జిల్లా స్థాయిలో పరిపాలనకు కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించినట్లు తెలుస్తోంది.

పీలేరు రెవెన్యూ డివిజన్‌లోకి పుంగనూరు

మంత్రుల సబ్ కమిటీ అధ్యయనం ప్రకారం ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రాయచోటి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పీలేరు నియోజకవర్గంలోని కేవీ పల్లె, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడతో పాటు పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచెర్ల మండలాలను కలపనున్నారు. ప్రస్తుతం మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యెం, తంబళ్లపల్లె, కురబలకోట, ములకలచెరువు, బి.కొత్తకోట, పీటీఎం మండలాలు ఉన్నాయి. ఈ రెండు రెవెన్యూ డివిజన్లతో మదనపల్లె జిల్లా ఏర్పాటు కావచ్చని పలువురు పేర్కొంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల గడువు వచ్చే ఏడాది మార్చితో ముగుస్తున్న నేపథ్యంలో అంతకు ముందే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని డిసెంబరులోపు ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు.

మదనపల్లె చిత్ర పటం





పెద్దదర్గా ఉర్సుకు ప్రత్యేక స్థానం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



విద్యుద్దీపకాంతులతో వెలుగుతున్న పెద్దదర్గా

కడప కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దదర్గా ఉర్సు ఉత్సవాలతో ప్రపంచ పటంలో కడపకు ప్రత్యేక స్థానం దక్కుతుందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున చాదర్ సమర్పించారు. ఈ మేరకు గురువారం స్థానిక వన్‌టౌన్ సమీపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకతీతంగా కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు జరగడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 2017 నుంచి ప్రభుత్వం తరపున దర్గా ఉత్సవాలకు చాదర్ సమర్పిస్తున్నామన్నారు. అనంతరం చాదర్‌ను కలెక్టర్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తలపై పెట్టుకుని దర్గాకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆర్డీఓ జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, టీడీపీ నాయకులు హరిప్రసాద్, అమీర్‌బాబు, జిలానీబాషా, మైనార్టీ నాయకులు సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : అధికారులు

4

మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలుశిక్ష

4

నేడు కడపకు రానున్న శ్రీచరణి

- నగర వీధులలో భారీ ర్యాలీ



శ్రీచరణి

కడప స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండియా జట్టు మహిళల వన్డే వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా ముద్దుబిడ్డ ఎన్.శ్రీచరణి శుక్రవారం సాయంత్రం కడపకు రానున్నారు. వరల్డ్ కప్ పోటీలలో శ్రీచరణి బౌలర్‌గా సత్తాచాటిన సంగతి యావత్ భారత క్రీడాభిమానులందరికీ తెలిసిందే. శ్రీచరణి శుక్రవారం సాయంత్రం 4-30 గంటలకు కడప చేరుకోనున్నారు. అనంతరం కడప హెడ్ పోస్టాఫీసు నుంచి , 7రోడ్లు, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ వరకూ భారీ ర్యాలీ చేస్తారు. సాయంత్రం 6-30 గంటలకు వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఆమెను సత్కరిస్తామని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌రెడ్డి, అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు.

ఇదీ శ్రీచరణి ప్రస్థానం

వీఎన్‌పల్లె మండలం యర్రబల్లెకు చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక దంపతుల చిన్న కుమార్తె శ్రీచరణి. చంద్రశేఖర్‌రెడ్డి 1992 నుంచి యర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీలో ఉద్యోగం చేస్తున్నారు. ఇక్కడే పుట్టిన శ్రీచరణి 10వ తరగతి వరకు డీఏవీ స్కూల్‌లో చదివింది. చిన్నప్పుడు కోకో, కబడ్డీ తర్వాత అథ్లెటిక్స్‌లో మంచి ప్రావీణ్యం చూపించింది. 9వ తరగతి నుంచి క్రికెట్ అంటే ప్రేమ పెంచుకుంది. తండ్రి క్రికెట్ వద్దని వారించారు. అయితే శ్రీచరణి అమ్మ, మేనమామ నచ్చచెప్పి ఆయనను ఒప్పించారు. మొదట కోచ్ సురేశ్ వద్ద శిక్షణ పొందింది. తరువాత మంగళగిరిలో శ్రీనివాసరెడ్డి కోచింగ్‌తో మరింత రాటుతేలింది. అండర్ 19లో, తరువాత ఉమెన్స్ టీ20లోను, శ్రీలంక మ్యాచ్‌లకు ఎంపికైంది. రెండు సంవత్సరాల్లోనే ఉమెన్స్ ప్రీమియర్‌లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆడి రాణించింది. అనంతరం ప్రపంచకప్ ప్రాబబుల్స్‌లో శ్రీచరణికి చోటు దక్కింది. ఇక మహిళల వన్డే వరల్డ్ కప్‌లో జరిగిన 9 మ్యాచ్‌లలో 14 వికెట్లు సాధించింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా మ్యాచ్‌లో రెండు కీలక వికెట్లు తీసింది. ప్రపంచకప్ సాధించిన జట్టులో శ్రీచరణి కీలక భూమిక పోషించడంతో జిల్లా ప్రజలు ఉప్పొంగిపోయారు. నేడు ఆమె రాకకోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

జగనన్న పట్టాలను ఏం చేసుకోవాలి?

స్థలాలు చూపని ఉత్త కాగితాలు ఎందుకు ● బి.కొత్తకోటలో బాధితుల ధర్నా



జగనన్న పట్టాలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బి.కొత్తకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఇళ్లలో మూలుగుతున్న జగనన్న ఇంటి పట్టాలను ఏం చేసుకోవాలి.. స్థలాలు చూపకుండా ఇదిగో జాగా, అదిగో ఇల్లు అంటూ మభ్యపెట్టి చేతిలో పెట్టిన ఉత్త కాగితాలు ఎందుకు? ఈ పట్టా కాగితాల్లో కనబరచిన సర్వే నెంబర్లలో స్థలం చూపక, కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వీలులేక తమ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైందని వందలాది మంది బాధితులు నిరసనకు దిగారు. గురువారం పట్టణానికి చెందిన బాధిత మహిళలు పెద్దసంఖ్యలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని గేటుకు అడ్డంగా బైఠాయించి ధర్నా చేశారు. వీరికి సీపీఐ నేతలు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ వైసీపీ హయాంలో బద్దిపల్లి, బెంగళూరు రోడ్డులోని సర్వే నెంబరు-59లో ఇంటిపట్టాలు ఇస్తున్నామంటూ 2024 ఫిబ్రవరి 20న దాదాపు 1000 మందికి నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు బహిరంగంగా జగనన్న ఇంటి పట్టాలను ఇచ్చారన్నారు. పట్టాలిచ్చి జాగాలను చూపలేదని, అప్పటి నుంచి ధర్నాలు, విన్నపాలు చేస్తూనే ఉన్నామన్నారు. ప్రభుత్వం మారినా తమకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటి ప్రభుత్వంలోనైనా కొత్తగా దరఖాస్తు చేసుకుందామంటే తమ పేరున పట్టా ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో వస్తోందని వాపోయారు. ఆ పట్టాలు చెల్లక, కొత్తగా దరఖాస్తు చేసుకునే వీలు లేకపోవడంతో తాము ఏం చేసేదని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. తహసీల్దార్ బావాజాన్ మాట్లాడుతూ ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు మనోహర్ రెడ్డి, రఘునాథ్, ఫయాజ్, అష్రఫ్‌అలీ, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడులు

- నాలుగు క్రేన్లు స్వాధీనం
- అడ్డుకున్న నాయకులు



వేముల మండలంలో ఉన్న అక్రమ మైనింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఎంజీ అధికారులు

కడప, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలో బెరైటీస్ అక్రమ తవ్వకాలపై ఏడీఎంజీ అధికారులు దాడులు చేశారు. గురువారం డీడీ సుబ్రమణ్యం, ఏడీ కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఈ దాడులు సాగించారు. వేముల మండలంలో అక్రమంగా వెలికితీస్తున్న ముగ్గురాయి గనులపై వీరు దాడులుచేసి నాలుగు క్రేన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎక్సకవేటర్ సాయంతో పెకిలించి అక్కడి నుంచి తరలించేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే స్థానిక నేతలు, అక్రమ మైనింగ్‌దారులు క్రేన్‌లను తరలించకుండా అడ్డుకున్నారు. అధికారులు ట్రాక్టర్లను బాడుగకు పిలవగా వారిని రానివ్వకుండా బెదిరింపులకు దిగారు. అలాగే క్రేన్‌ల వద్దకు వెళ్లే దారిలో కూడా అడ్డగించారు. దీనితో ఏడీఎంజీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నా, ఇష్టమొచ్చినట్లు ముగ్గురాయి అమ్ముకుంటున్నా మేము చూస్తూ ఉండాలా అని ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం వేంపల్లె మండలంలో కూడా ఏడీఎంజీ అధికారులు అక్రమ తవ్వకాలపై దాడులు చేశారు. అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ కార్యక్రమంలో ఏడీఎంజీ ఆర్ఐలు, వేముల తహశీల్దార్ రెడ్డిలక్ష్మి, ఆర్ఐ పాల్గొన్నారు.

గుండెపోటుకు ఉచితంగా రూ.40 వేల ఇంజక్షన్

- డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు



కలికిరి సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు

కలికిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయం నుంచి తక్షణం కాపాడటానికి రూ.40 వేల విలువ జేసే ఇంజక్షన్ ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య ఆరోగ్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ అంజనేయులు తెలిపారు. గుండెపోటుకు గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని, ఈసీజీ తదితర పరీక్షలు చేసి అవసరమైతే విలువైన ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం రెఫరల్ ఆసుపత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి కాపాడగలమని ఆయన చెప్పారు. గురువారం ఆంజనేయులు స్థానిక సీహెచ్‌సీని సందర్శించారు. వైద్యశాల కొత్త భవనాల్లో మాతా శిశు వైద్య సేవలు, ఎక్స్‌రే, ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. పాత భవనాలకు మరమ్మతులు చేస్తున్న కారణంగా ఓపీ సేవలను తాత్కాలికంగా కొత్త భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పాము, కుక్క కాటుకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఓపీ, ఐపీ సేవలు, డెలివరీలు, ఈహెచ్ఆర్, ఎన్టీఆర్ వైద్య సేవలు, ఏబీహెచ్ఏ, ఎఫ్ఆర్ఎస్, ల్యాబ్, ఫార్మసీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లను ఆంజనేయులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమకు జీతాలు సరిగ్గా రావడం లేదని శానిటేషన్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. వెంటనే కాంట్రాక్టరుతో మాట్లాడిన అనంతరం సాయంత్రానికి జీతాలు జమవుతాయని హామీ ఇచ్చారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్, వైద్యులు ఉదయకిరణ్, ఆశాలత, సిమ్రాన్, ఇన్‌చార్జి హెడ్ నర్స్ వనజమ్మ, ఫార్మసిస్ట్ మొయినుద్దీన్, రేడియోగ్రాఫర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీ'ఛీ' రోడ్లు

- సీసీ రోడ్లకు కొత్త నిర్వచనం
- కంకర, ఇసుకతోనే రోడ్ల నిర్మాణం
- ఆ కాంట్రాక్టర్ అంటే అందరికీ హడల్
- బిల్లుల కోసం రాజకీయ ఒత్తిళ్లు
- అధికారులను బెదిరిస్తున్న వైనం



మట్టి, కంకరతో వేసిన సీసీ రోడ్డు



నల్లంవారిపల్లిలో నాసిరకంగా చేపట్టిన సీసీ రోడ్లు

నిమ్మనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయన అంటే అధికారుల్లో భయం, తాను చేసిందే పని అని, రోడ్లు భవన నిర్మాణాలు కంకర, మట్టితోనే చేశారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు కంకర, మట్టితోనే బిల్లులను పాస్ చేయించుకునేందుకు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారనే విషయాన్ని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారం చేపట్టినా తాను అందులోకి ఒదిగి పోయే గుణం ఉంది. కాంట్రాక్టు పనులు చేస్తూ అందిన కాటికి దోచుకుంటున్నాడు. వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పి ప్రస్తుతం టీడీపీలోకి చేరి అందులోనూ తనదైన ముద్ర వేసుకుంటున్నాడు ఓ కాంట్రాక్టర్. వివరాల్లోకెళితే... వెంగంవారిపల్లి పంచాయతీ నల్లంవారి పల్లెకు చెందిన ఓ కాంట్రాక్టర్ వైసీపీ ప్రభుత్వంలో వెంగంవారిపల్లి కొమరంభీం కాలనీ తవళం పంచాయతీలో మట్టి, కంకర మాత్రమే ఉపయోగించి సీసీ రోడ్లను వేశాడు. అవి కాస్త వర్షానికి కొట్టుకుపోయాయి. అంతేకాకుండా వైసీపీ ప్రభుత్వంలో దాదాపు కోటి రూపాయలతో సచివాలయం, పాల కేంద్రం, ఆర్బీకే భవనాలను నిర్మించాడు. నిర్మాణ సమయంలో గోడలు కింద పడిపోగా సచివాలయం పైకప్పులో కమ్మీలు బయట పడ్డాయి. బాహుదా ప్రాజెక్టు వద్ద నిర్మించిన అదనపు గది కూడా నాసికరంగా ఉంది. చెక్‌డ్యాంలు, వంతెనలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, మురుగు నీటి కాల్వలు ఒకటేమిటి ఆయన చేసిన అన్ని పనులు నాసిరకంగా ఉండడంతో కొద్ది పాటి వర్షానికే కూలి పోయే పరిస్థితి ఏర్పడింది. కొందరు అధికారులు నాణ్యత లేని పనులకు బిల్లులు చేయకపోవడంతో వారిపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి అధికారులు సైతం భయపడేలా చేస్తున్నాడు. ఇంతగా నాసిరకం పనులు చేస్తున్నా మళ్లీ అతనికే పనులు అప్పగించడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో నిమ్మనపల్లి మండలాన్ని టీడీపీ ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించడంతో ట్యాంకర్లతో నీటిని తోలకుండానే బిల్లులు చేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

స్వామిత్వ సర్వేలో తేలిన నాసిరకం పనులు

మండలంలో సీసీ రోడ్లు, భవనాలను నాసిరకం పనులు చేపట్టారని గురువారం చేపట్టిన స్వామిత్వ సర్వేలో కార్యదర్శి నాగభూషణం తేల్చారు. వెంగంవారిపల్లి పంచాయతీలో కొమరంభీం కాలనీ, నల్లంవారిపల్లి, సాగిబండవారిపల్లిలో సీసీ రోడ్లను కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి మట్టి కంకరతో నిర్మించాడు. వీటిని గురువారం పరిశీలించిన పీఆర్, పంచాయతీ అధికారులు నాణ్యత సక్రమంగా లేదని, కేవలం సిమెంట్ వేయకుండానే నిర్మించడంతో బిల్లులు చేసేందుకు కార్యదర్శి నిరాకరించారు. దీంతో సమస్యను ఎంపీడీవో రమేశ్ దృష్టికి తీసుకెళితే ఉన్నతాధికారులకు సమస్యను తెలపనున్నట్లు చెప్పారు.



కొమరంభీం కాలనీలో మట్టితో నిర్మించిన సీసీ రోడ్డు

పీలేరుకు డయాలసిస్ సెంటర్..

• ఫలించిన వైద్యుడి కృషి • ప్రారంభానికి సన్నాహాలు ముమ్మరం • దాదాపు 200 మందికి ప్రయోజనం

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దశాబ్దం క్రితం వరకు కంటి శస్త్ర చికిత్సలకు లయన్స్ క్లబ్ పెట్టింది పేరు. ఎంతో క్లిష్టమైన కంటి జబ్బులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగానే చికిత్స అందేది. కాలానుకుణంగా చిన్న, మధ్య తరహా ఊళ్లలో కూడా కంటి వైద్యం అందరికీ అందుబాటులోకి రావడంతో లయన్స్ క్లబ్‌పై ఒత్తిడి తగ్గింది. దీంతో సేవలు మరింత విస్తృతం చేయాలని పీలేరుకు చెందిన ప్రముఖ వైద్యుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్ సంకల్పించారు. అందులో భాగంగా పీలేరులో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆలోచించారు. ఆలోచనతో సరిపెట్టుకోకుండా క్లబ్ సహచరులను వెంట బెట్టుకుని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసి, పీలేరుకు డయాలసిస్ కేంద్రం అవసరం ఉందన్న బీజాన్ని వారిలో నాటారు. డాక్టర్ ప్రసాద్ ఆలోచన, పీలేరు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల విజయభాస్కరరెడ్డి ప్రయత్నం, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవ ఫలించి పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరైంది. ప్రధాన మంత్రి జాతీయ డయాలసిస్ ప్రోగ్రాం (పీఎంఎన్‌డీపీ) ద్వారా పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అక్టోబరు 21న ప్రకటించారు. దీంతో పీలేరు ప్రాంతంలోని 200 మంది డయాలసిస్ రోగులకు ప్రయోజనం కలుగనుంది. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్న మంత్రి ప్రకటనకు అనుగుణంగా పీలేరులో కేంద్రం నిర్వహించేందుకు అపోలో ఆసుపత్రుల యాజమాన్యం ముందుకు వచ్చింది. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది.


తిరుపతి స్విమ్స్‌లోని డయాలసిస్ వార్డు (ఫైల్ ఫోటో)

విస్తృత వైద్య సేవల కోసమే..



లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతమైన వైద్య సేవలు సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పూనుకున్నాం. మా ప్రయత్నం ఫలించి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావడంతో ఎంతో సంతోషంగా ఉంది.

- డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్

ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు ..



మా ప్రయత్నాలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. అసెంబ్లీలో ఆయన మాట్లాడిన తర్వాతనే సెంటర్ ఏర్పాటు ప్రక్రియలో వేగం వచ్చింది. ప్రసాద్ ఆలోచనతో ఎంతో మందికి మేలు జరగనుండడంతో ఎంతో ఆనందంగా ఉంది.

- చింతల విజయభాస్కరరెడ్డి, పీలేరు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

పీలేరు పరిసరాల్లో 200 మంది రోగులు

శరీరంలోని వ్యర్థాలను కిడ్నీలు వడపోత చేస్తాయి. ఒకరోజులో దాదాపు 180 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయని అంచనా. అధిక రక్తపోటు, దీర్ఘకాలిక మధుమేహం, కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు, మితిమీరిన మందుల వినియోగం వంటి కారణాలతో కిడ్నీలు పాడవుతుంటాయి. ఇలాంటి సమస్యతో బాధపడుతున్న వారి రక్తాన్ని ప్రత్యేక యంత్రం ద్వారా శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను డయాలసిస్ అంటారు. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు సార్లు లేదా నాలుగు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. దీర్ఘకాలికంగా కిడ్నీ జబ్బులున్న వారికి జీవితాంతం డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలతోపాటు చిత్తూరు జిల్లా సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన 200 మంది తిరుపతిలోని స్విమ్స్‌తోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతి వారం డయాలసిస్ చేయించుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ ఉచితంగా లభిస్తున్నప్పటికీ పీలేరు నుంచి తిరుపతికి వెళ్లేందుకు రోగులు అవసోపాలు పడుతుంటారు. డయాలసిస్ కేంద్రాలు 24గంటల ప్రాతిపదికన నడుస్తుండడంతో నిర్వాహకులు ఎప్పుడు చెబితే అప్పుడు అక్కడకు వెళ్లాల్సి ఉంటుంది. కొంత మందికి పగలు స్లాట్ దొరికితే, కొంత మందికి రాత్రి పూట దొరుకుతూ ఉంటుంది. ఆ సమయంలో వాహనాలు సమకూర్చుకుని, వెంట సహాయకులను తీసుకెళ్లాల్సి ఉంటుంది. దీంతో డయాలసిస్ సేవలు ఉచితంగా అందుతున్నా ఒక్కో సిట్టింగ్ కోసం బాధితులు రూ.2500ల నుంచి రూ.4 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. పీలేరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ఆ ఖర్చులు గణనీయంగా తగ్గిపోతాయని పలువురు బాధితులు తెలిపారు.

లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రి నిర్వహించేందుకు పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో రూ.1.50 కోట్ల వ్యయంతో అధునాతన భవనం నిర్మించారు. ఆ భవన నిర్మాణానికి డా.ప్రసాద్ దాదాపు రూ.40 లక్షల స్వంత నిధులు వెచ్చించారు. ఆ భవనంలోనే కొన్ని మార్పులు చేసి డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ భవనంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అటు ప్రభుత్వం, ఇటు అపోలో సంస్థ అంగీకరించింది.

ఒకటిన్నర నెల క్రితం ఆ సంస్థ ప్రతినిధులు భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం 32 కిలోవాట్ల జనరేటర్, ఒక నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేయమని అపోలో సంస్థ కోరగా, దాదాపు రూ.10లక్షలు వ్యయమయ్యే ఆ వసతులు కల్పించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు అంగీకరించారు. దీంతో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి మార్గం సుగమమైంది. సుమారు ఒక నెల రోజుల్లో అక్కడ డయాలసిస్ సేవలు ప్రారంభం అవుతాయని లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల విజయ భాస్కర రెడ్డి తెలిపారు. తొలుత మూడు బెడ్ల సౌకర్యంతో ప్రారంభమయ్యే సేవలు, 15 బెడ్‌ల వరకు పెరుగుతాయని, ఆ కేంద్రాన్ని అపోలో సంస్థ ఐదేళ్ల వరకు నిర్వహిస్తుందని ఆయన వివరించారు.


డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్న భవనం

ఖర్చులు తగ్గిపోతాయి..



ఒక సిట్టింగ్‌కు తిరుపతికి పోయి రావడానికి రూ.3 వేల నుంచి రూ.4 వేల దాకా ఖర్చు అవుతుంది. సెంటర్ నిర్వాహకులు ఎప్పుడు సమయం ఇస్తే అప్పుడు వెళ్లాలి కాబట్టి రాత్రి పూట వెళ్లాలంటూ ఇబ్బందిగా ఉంటుంది. అందుకని కారు తీసుకెళ్లాలి. పీలేరులో డయాలసిస్ సెంటర్ వస్తే ఆ ఖర్చు కూడా తగ్గిపోతుంది. మిగిలే ఆ నాలుగు డబ్బులు కుటుంబం కోసం ఖర్చు చేసుకోవచ్చు.

- సాయి సత్యం, డయాలసిస్ రోగి, పీలేరు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

• పోస్టర్లు ఆవిష్కరించిన సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ కల్యాణి

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో పది ప్రైవేటు సంస్థలతో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి 9553202509, 6301612761 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

• డీఎల్‌డీవో లక్ష్మీకాంతం

రామాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో లక్ష్మీకాంతం గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దిబ్బలు, చెత్తాచెదారాలు లేకుండా శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. వీధుల్లో చిన్న చిన్న గుంతలు ఉన్నచోట నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటివి రాకుండా చూడాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లోని చెత్తను సంపద కేంద్రాలకు తెచ్చి పొడి, తడి చెత్తలుగా వేరు చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చెంబకూరు విద్యార్థి


తరుణ్‌కుమార్ రాజు

రామసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఎంపికల్లో చెంబకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి జె.తరుణ్‌కుమార్‌రాజు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతి ఎస్వీ క్రీడామైదానంలో గురువారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో అండర్-17కు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. పీడీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తరుణ్‌కుమార్‌రాజు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. తరుణ్‌ను పాఠశాల హెచ్‌ఎం రమేశ్‌బాబు, పీడీ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులను విస్మరిస్తే ప్రభుత్వానికి మనుగడ ఉండదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను విస్మరిస్తే ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, ప్రధాన కార్యదర్శి నాసర్ అన్నారు. గురువారం స్థానిక జీఆర్‌టీ హైస్కూల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సుయాత్ర సభలో వారు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర సాగుతోందని, ఇందులో భాగంగా 16వ రోజు మదనపల్లెకు చేరుకుందన్నారు. ఎన్నికల సమయంలో విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చిన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే సమస్యలకు పరిష్కారం చూపడం లేదన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని చెప్పిన మంత్రి లోకేశ్ ఏడాదిన్నర దాటినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అమలు చేస్తామనడం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమేనన్నారు. ఈనెల 12వ తేదీన అనంతపురంలో ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ నాగభూషణం, భవిత, ప్రవీణ్‌కుమార్, అభినయ్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్యారంపల్లెలో నగలు చోరీ

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్యారంపల్లెలో బుధవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన దాదిని లోకనాథ్ బుధవారం మధ్యాహ్నం పొలం పనుల నిమిత్తం వ్యవసాయ భూముల వద్దకు వెళ్లిన సమయాన గుర్తుతెలియని దుండగులు ఇంటి ఆవరణలో దాచిన తాళాలను తీసుకుని చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం చీకటి పడ్డాక ఇంటికి వచ్చి గమనించిన లోకనాథ్ కుమార్తె మౌనిక తల్లిదండ్రులకు విషయం తెలిపింది. ఇంటి బీరువా తాళాలు పగులగొట్టి అందులోని రూ.2లక్షల 60వేలు విలువ చేసే బంగారు నగలను దుండగులు అపహరించుకుపోయారు. దాదిని లోకనాథ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


తుఫానుతో నష్టపోయిన పంటలు పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం సహా అన్నమయ్య జిల్లాలో మొంథా తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ తెలిపారు. గురువారం తాటిగుంటపల్లె, మూరేవాండ్లపల్లె, టేకలకోన గ్రామాల్లో టమోటా, బొప్పాయి పంటలను పరిశీలించారు. తుఫాను సృష్టించిన బీభత్సంతో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను, తుఫాను బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణదేవర, జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

11 మంది జూదరులకు జైలుశిక్ష

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ 2021లో పోలీసులకు పట్టుబడిన 11 మంది జూదరులకు తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల పరిధిలో పలువురు పేకాట ఆడుతూ 2021లో 11 మంది పట్టుబడ్డారు. దీంతో ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అప్పటి ఎస్‌ఐ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో పూర్వాపరాలను విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడంతో 11 మందికి 7 రోజుల జైలు శిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు తెలిపారు. జరిమానా కట్టని పక్షంలో మరో 30 రోజులు అదనంగా సాధారణ జైలు శిక్ష విధించినట్లు జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన


విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారుల బృందం

పీలేరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల పర్యవేక్షకుల బృందం పరిశీలించింది. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెయిన్, బాలికల పాఠశాల, కోటపల్లె జడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లను తనిఖీ చేశారు. విద్యార్థుల అవసరాల మేరకు సరిపడా ఫర్నీచర్, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెంటిలేషన్ మొదలగు వాటిని పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల ప్రిపరేషన్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, బోధన తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చక్కటి ప్రణాళికతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిశీలన బృందంలో ప్రభుత్వ పరీక్షల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ రవికుమార్, పరీక్షా విభాగం సిబ్బంది నాగరాజు, హెచ్‌ఎంలు ప్రేమరాణి, రేణుకాదేవి, జయపాల్ రెడ్డి, బాబు, శివ శంకరయ్య, సీఆర్‌పీ జే. మురళీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మదనపల్లె అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 15, 16న తేదీల్లో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పివిరమణ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై రాజీ పడకుండా ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోరాడుతోందన్నారు. రెగ్యులర్ చేస్తామని పాలకుల హామీల కోసం హక్కుల సాధన కోసం, పనికి సమాన వేతనం పొందడానికి మళ్లీ పోరాటాలకు నాంది పలికామన్నారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె బి.కొత్తకోట మున్సిపల్ వర్కర్స్ హాజరై రాష్ట్ర మాహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ రాజు, జిల్లా నాయకులు గంగయ్య, గోపాల్, శ్రీరాములు. శ్రీనాథ, రామకృష్ణ, కృష్ణప్ప, వెంకటరమణ, పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

నిమ్మనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల వేలం ద్వారా రెడ్డివారిపల్లి పంచాయతీకి రూ.64 వేల ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీవో నాగరాజ, ఎంపీడీవో రమేశ్ తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపల చెరువులను వేలం వేశారు. పంచాయతీలో మొత్తం ఐదు చెరువులను వేలం వేస్తే సీతమ్మచెరువు రూ.25 వేలు, వీరప్పచెరువు రూ.22 వేలు, బొడికిందరాయని చెరువు రూ.12 వేలు, దాసరివానికుంట రూ.3 వేలు, మొరపు కుంట రూ.2 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. మొత్తం పంచాయతీకి రూ.64 వేలు ఆదాయం వచ్చిందని దీనిని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు తెలిపారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ చెరువులు పాడుకొన్న లబ్ధిదారులు చెరువుల్లో కేవలం చేపలు మాత్రమే పట్టి అమ్ముకోవచ్చని ఇతరత్రా పనులకు ఉపయోగించరాదన్నారు. చెరువుకు ఇచ్చిన సమయం అయిపోగానే తిరిగి వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలుశిక్ష

రాయచోటిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్విని నలుగురికి ఒక్కొక్కరికి రూ.11 వేలు చొప్పున జరిమానా విధించడంతో పాటు మరో ఐదుగురికి ఒక్కొక్కరికి మూడు రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీసులు సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెలలో పట్టుబడిన 9 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి డ్రంకెన్ డ్రైవ్‌కు పాల్పడిన వారికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సీఐ తెలియజేశారు. సమాజ శ్రేయస్సు దృష్ట్యా రోడ్డు భద్రత అవగాహనలో భాగంగా పోలీసులు ఎన్నిసార్లు సూచనలు చేసినా పెడచెవిన పెట్టి రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తూ నాకేం కాదులే అనే ఉద్దేశ్యంతో వాహనాలు నడిపే వారికి ఇదొక గుణపాఠం అన్నారు. భవిష్యత్తులో కూడా మీ శ్రేయస్సు మీ కుటుంబ శ్రేయస్సు, సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మరింత పటిష్ఠంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి భవిష్యత్తులో మరింత జైలుశిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

గాలివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లచెరువు పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డిల సమక్షంలో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. ముందు నుంచి పార్టీని నమ్ముకున్న వారికి, కొత్తగా చేరుతున్న వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అందరూ సమన్వయంగా కలిసి మెలిసి పార్టీ అభివృద్ధికి పాటుపడడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉదయ్ కుమార్, నాగేశ్వర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి మండిపల్లి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న నాయకులు, ప్రజలు

బంగారు భవిష్యత్తుకు వేదిక గ్రంథాలయాలు

• రూ.2 లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు • పాఠశాల అభివృద్ధికి దగ్గుబాటి సాయం


ఎస్‌ఐకి సీసీ కెమెరాలను అందిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కలకడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు గ్రంథాలయాలు చక్కని వేదికని దగ్గుబాటి వెంకటేశ్వరరావు, డీవైఈవో లోకేశ్వరరెడ్డి అన్నారు. గురువారం బాటవారిపల్లె హైస్కూల్ గ్రంథాలయానికి లయన్స్ క్లబ్ తరపున లయన్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రజనీకుమార్, బరకం శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఇతర దాతలు రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చారు. పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభ సమావేశంలో డీవైఈవో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దగ్గుబాటి వెంకటేశ్వరరావు సొంతంగా రూ.11 లక్షలు ఖర్చు చేసి సమాజ సేవకు అంకితమయ్యారని కొనియాడారు. విద్యార్థుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ తరపున రూ.8 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న గొప్పవ్యక్తుల దాతృత్వం చిరకాలం నిలిచిపోతుందని వక్తలన్నారు. ఎంవీ రాప్స్ చిట్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల భద్రత, రక్షణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విలువైన సోలార్ సీసీ కెమెరాలను ఎస్‌ఐ రామాంజనేయులుకు అందజేశారు. అనంతరం దగ్గుబాటి మాట్లాడుతూ తన సాయశక్తులా కృషి చేసి రాబోయే రెండేళ్లలో మూడు మండలాల ప్రజలకు అనువుగా లయన్స్ ఆస్పత్రి, దాతల సహకారంతో ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుబాటిని హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల పరిశీలకుడు శ్రీనివాస్‌రాజు, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంఈవో మునీంద్రనాయక్, హెచ్‌ఎంలు, లయన్‌లు హరినాథ్‌నాయుడు, ప్రసాద్, అబ్బూరి తిరుపతి నాయుడు, పునీత్‌చౌదరి, హరినాథ్ నాయుడు, వైపీ రమణ, ఉపాధ్యాయులు లోకా జగన్నాథశాస్త్రి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయం ప్రారంభంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు వయస్సు నిండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్‌యాదవ్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి సీఈవో వీసీ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్ట్రోరల్ రోల్స్ (ఎస్.ఐ.ఆర్-2025)పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న ఎస్ఐఆర్-2025 కార్యక్రమంపై పలు సూచనలు, మార్గదర్శకాలు వర్చువల్ విధానంలో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాలో నమోదు చేపట్టాలన్నారు. అనర్హులను తొలగించడం, జాబితా పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సీఈవో సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కిచెన్లతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య (ఎంఎస్) ఆధ్వర్యంలో స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా సమాఖ్య కార్యాలయంలో గురువారం అధ్యక్షురాలు హసేనమ్మ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ స్మార్ట్‌కిచెన్ల ఏర్పాటుతో నెలకు రూ.20వేల నుంచి 30వేల వరకు మండల సమాఖ్యలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈప్రాజెక్టును రాష్ట్రస్థాయిలో మొట్టమొదటిసారిగా జిల్లాలో కలెక్టరు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలను దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన, రుచికరమైన భోజనాన్ని వడ్డించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఇప్పటికే సీకేదిన్నె మండలంలో స్మార్ట్‌కిచెన్‌ను మండల సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐబీడీ పీఎం లావణ్య, వివిధ విభాగాల యాంకర్ పర్సన్స్, జిల్లా సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాక్ క్లైంబింగ్ క్యాంప్‌నకు ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంలో అడ్వెంచర్ క్యాంప్‌లు ఎంతో దోహదపడతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. కడప ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సయ్యద్ అలీ, మహమ్మద్‌లు నవంబరు 10 నుంచి 21వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగబోయే రాక్ క్లైంబింగ్ క్యాంప్‌నకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికయ్యారు. వీరిని గురువారం కళాశాల ప్రాంగణంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ సైనిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో అడ్వెంచర్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్‌తో పాటు క్యాడెట్లు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లో దొరికిన వాళ్లంతా వైసీపీ వాళ్లే

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి



మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ కేసులో ఉన్న వాళ్లంతా వైసీపీ కార్య కర్తలే అని, క్యాసినోలో టీడీపీ ముసుగు వేసు కున్న వాళ్లుంటే ఉపేక్షిం చవద్దని ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి స్వయంగా ఎస్పీకి లెటర్ ఇచ్చాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యా లయంలో ఆయన ముక్తియార్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ నేను హింసా రాజకీయాలను ప్రోత్సహించనని తనకు తానుగా రాచమల్లు కితాబు ఇచ్చుకుంటే.. నందం సుబ్బయ్య హత్య తరువాత ప్రొద్దుటూరు ప్రజలు ఎవ్వరూ నమ్మరన్నారు. ఎగ్జిబిషన్ బకాయిలు చెల్లించలేదని కోర్టులో కేసులు వేశారు. మళ్లీ టెంట్లు వేసి రిలేదీక్షలు పేరుతో చేస్తున్న రాజకీయం ఏమిటని ప్రశ్నించారు. ఎగ్జిబిషన్ బకాయిలు, ఇతర సమస్యల మీద కాకుండా అక్కడ కూర్చొని ప్రొద్దుటూరులో జరిగే అసాంఘిక కార్యకలాపాలన్నీ టీడీపీ అండతో సాగుతున్నాయని చెప్పడం చూస్తేనే రాచమల్లు చేస్తున్న రాజకీయాలు ఏమిటో తేట తెల్లమవుతుందన్నారు. జూదం, బెట్టింగ్‌లు, సారా, మాంసం వ్యాపారాల్లో వరదరాజులరెడ్డి కుటుంబం ఎప్పుడు లేదన్నారు. రాచమల్లు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అతన్ని ప్రొద్దుటూరు ప్రజలు నమ్మలేరన్నారు. సమావేశంలో మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్‌ముక్తియార్, మాజీ కౌన్సిలర్లు వద్దిబాలుడు, తలారి పుల్లయ్య, కౌన్సిలర్ జిలాన్, ఖలీల్‌లు తదితరులు పాల్గొన్నారు.

పౌరులకు సుపరిపాలనే కూటమి పాలన లక్ష్యం

- డేటా ఆధారిత పాలన సదస్సులో సీఎం



సీఎం వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వో

కడప కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని పౌరులకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం డేటా ఆధారిత పాలనపై ముఖ్యమంత్రి అధ్యక్షతన రాజధానిలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, డీఎఫ్ఓ వినీత్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత కావాలన్నారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకొని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేయడం వల్ల మొంథా తుపాన్ నుంచి ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించామన్నారు. డేటా ఆదారిత పాలన అనేది ఇపుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించడం జరుగు తుందన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా వనరులను సమర్థవం తంగా వినియోగించుకోగలుగుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేయడం జరుగుతుందన్నారు.

చోరీ, చైన్‌స్నాచింగ్ కేసుల్లో ఇద్దరు అరెస్టు

- 21 తులాల బంగారు నగలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో ఇటీవల బంగారు దుకాణాల్లో జరిగిన చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను వన్‌టౌన్, త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఆమేరకు గురువారం డీఎస్పీ భావన ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో నిందితుల అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణం పరిధిలోని మహబూబ్ షరీఫ్, పోలంకి మహేష్‌లకు చెందిన బంగారు అభరణాల దుకాణాలలో బంగారు నగలు చోరీ చేసిన దొంగను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ రెండు దొంగతనాలు రాగా హరీష్ అనే దొంగ చేశాడన్నారు. ఇతనిది అనంతపురం జిల్లా చెన్నెకొత్తపల్లె నామాల గ్రామం అని, ప్రస్తుతం కడప చిన్నచౌక్‌లో ఉంటున్నట్లు తెలిపారు. ఈరెండు చోరీలు చేసిన నిందితున్ని సీసీ కెమెరాల్లోని పుటేజీల ఆధారంగా గుర్తించామన్నారు. ఈ కేసులో మొత్తం 18.1 తులం బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే బుధవారం రాత్రి త్రీటౌన్ పరి ధిలోని భగత్‌సింగ్ కాలనీలో ఇంటి ముందు అరుగుపై ఒంటరిగా కూర్చొని ఉన్న వృద్ధురాలు జానపాటి లక్ష్మీదేవి (72) మెడలో గొలుగును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారైన కేసులో షేక్ మౌలాలి (31) అనే నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతను ప్రొద్దుటూరు హోమస్‌పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతని వద్ద నుంచి 30గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. వీరందిరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, త్రీటౌన్ సీఐ వేణు గోపాల్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎస్ఎస్ఆర్ ఎడ్లు విజయం



బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బండలాగు పోటీల్లో ఎస్ఎస్ఆర్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.3లక్షల నగదు బహుమతి సాధించాయి. ధరణి తిమ్మాయపల్లె అవధూత కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం వృషభరాజములచే రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కొండయ్యస్వామి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. తెలంగాణ హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, గాండీవ, వీర నరసింహారెడ్డిలకు చెందిన ఎస్ఎస్ఆర్ ఎడ్లు 2వేల 455 అడుగులు బండలాగి మొదటి స్థానంలో నిలిచి రూ.3లక్షల నగదు బహుమతి గెలుచుకోగా, కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి, తోట తిరుపాల్‌రెడ్డి, దుబ్బన్న, చెన్నకేశ వరెడ్డిలకు చెందిన ఎడ్లు 2 వేల 418 అడుగులు బండలను లాగి రెండో బహుమతి కింద రూ.2లక్షల నగదు అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతులను కొండయ్యస్వామి స్వయంగా విజేతలకు అందచేశారు.

గుప్తనిధుల వేటగాళ్లు పట్టివేత



గుప్తనిధుల వేటగాళ్ల కోసం గాలిస్తున్న గ్రామస్థులు, పట్టుబడిన వేటగాళ్లు దిలీప్‌రెడ్డి, శశికుమార్, శ్రీధర్

నంబులపూలకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలంలో గుప్త నిధుల వేటకు వచ్చిన ముగ్గురిని గ్రామస్థులు పట్టుకున్నారు. ధనియాన్‌చెరువు పంచాయతీ డి.గొల్లపల్లి సమీపంలో పురనాతన నరసింహస్వామి ఆలయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వద్ద రాత్రిపూట సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. ధనియాన్ చెరువు, పాతూరు గ్రామాలకు ఈ సమాచారాన్ని చేరవేశారు. రెండు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయాన్ని చుట్టుముట్టారు. ఆలయం వద్ద ఒక ఆటో, ద్విచక్రవాహనం ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్థుల రాకను పసిగట్టిన ముఠా పారి పోయేందుకు ప్రయత్నించిది. వీరిలో శశికుమార్, శ్రీధర్‌ను ఆలయ సమీపంలో పట్టుకున్నారు. దిలీప్‌రెడ్డి అనే వ్యక్తి పారిపోగా వెంబడించి పొలాల్లో పట్టుకున్నారు. గ్రామస్థులు పట్టుబడిన వారిని నిలదీయగా, తమది అన్నమయ్య జిల్లా మదనపల్లి అని, గుప్త నిధుల తవ్వకాల కోసం ఐదుగురం వచ్చా మని ఒప్పుకున్నారు. పారిపోయిన వారిలో ఒక మహిళ, మరో వ్యక్తి ఉన్నారు. వారికోసం గ్రామస్థులు పొలాలు, గుట్ట ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పట్టుబడినవారిని పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బోరు నారాయణరెడ్డి (78) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం నారాయణరెడ్డి స్కూటర్‌పై తమ గ్రామానికి వస్తూ.. దత్తాపురం గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా కడప నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈసంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణరెడ్డికి భార్యతో పాటు, పెళ్లైన కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి సుందరయ్య కాలనీలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తి అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించి మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన లక్కినేని దేవరాజ్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. తీరా పెళ్లికి నిరాకరించడంతో ఆ యువతి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

భార్యపై రోకలిబండతో దాడి

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉస్తికా యలపల్లెలో గురువారం వీరమ్మ అనె మహిళపై ఆమె భర్త శివరంగారెడ్డి రోకలిబండతో దాడి చేయడంతో తీవ్ర గాయా లయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా భార్య, భర్తలు దూరంగా ఉన్నారని, భూమి విషయమై మనస్పర్థల కారణంగా ఈ సంఘటన జరిగిందని తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు మైదుకూరు విద్యార్థి ఎంపిక



మైదుకూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రెజ్లింగ్ అండర్-14 విభాగంలో మైదుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పాశం వెంకటనవీన్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రామ్‌నాయక్, ఫాతిమా తెలిపారు. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి, ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంఈఓ పద్మలత, పాఠశాల హెడ్మాస్టర్ ఇలియాస్ అహమ్మద్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన నవీన్

వెల్లాల దేవస్థానానికి రూ.7.26 లక్షలు ఆదాయం



వెల్లాల దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

రాజుపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చెన్నకేశవ సంజీవరాయస్వామి, భీమలింగేశ్వరస్వామి దేవస్థానాలకు రూ.7,25,866 ఆదాయం వచ్చినట్లు ఆలయ పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈవో రమణ తెలిపారు. గురువారం ఆలయంలోని జ్ఞానమందిరంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 17.5.2025 నుంచి 6.11.2025 వరకు భక్తులు హుండీలలో సమర్పించిన డబ్బులను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే ఆంజనేయస్వామికి భక్తులు సమర్పించిన 1400 కిలోల పెసరబేడలను కిలో రూ.29 చొప్పున వేలం ద్వారా విక్రయించడంతో 40,600 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ వేలంపాటలో ఉత్సవ కమిటీ చైర్మన్ గంగిరెడ్డి నారాయణరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పురుషుల, మహిళా జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ టి.నారాయణరావు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు, క్రీడాకారిణులు విజయనగరం జిల్లా కొండ వెలగడ గ్రామంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న ఏపీ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికలకు హాజరయ్యే వెయి ట్ లిఫ్టర్లు ఐడబ్ల్యుఎల్ఎఫ్ కార్డు కలిగి వుండాలన్నారు. క్రీడాకారులు తమ వివరాల కు సంబంధించి వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో సంప్రదించాలన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా బీసీ సంక్షేమ, సాధికార అధికారి ఎం.అంజల ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు ఈ స్కీంకు అర్హులన్నారు. ఓబీసీ, ఈబీసీ విద్యార్థులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 9, 10తర గతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 75 వేల రూపాయలు, ఇంటర్‌కు లక్షా 25వేల రూపాయల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని వివరించారు.

నేడు విద్యార్థులకు నైపుణ్య పోటీలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు వృత్తి విద్యలో చేరిన విద్యార్థులకు జిల్లాస్థాయి నైపుణ్య పోటీలను సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలస్థాయి పోటీల ద్వారా ఎంపికైన 206 ప్రాజెక్టులు శుక్రవారం కడప మాసాపేటలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

బేస్‌బాల్ ఎంపిక పోటీలు వాయిదా

రైల్వేకోడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న బేస్‌బాల్ ఎంపిక పోటీలు వాయిదా వేసినట్లు ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు టీఎన్‌వీ వెంకటేశ్వర్లు, డీవీఈవో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అండర్-19 స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలను నిర్వహించే తేదీలను మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి


మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు, ఉపాధ్యాయులు

సుండుపల్లె, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్టు అధికారులు తెలిపారు. కార్తీక వన మహోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో గురువారం ఫారెస్ట్ అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన అవి వృక్షాలై సకాలంలో వర్షాలు కురుస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు స్వాతి, సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి హెడ్మాస్టర్ నాగార్జున, ఉపాధ్యాయులు దేవలా నాయక్, పద్మావతి, పీడీ రాధారాణి పాల్గొన్నారు.

గోపురం నిర్మాణానికి విరాళం


ఆలయానికి విరాళం అందిస్తున్న దాతలు

సిద్దవటం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని ఎస్‌కేఆర్‌నగర్‌లో వెలసిన సీతారాముల ఆలయం గోపుర నిర్మాణానికి రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ రూ.50వేలు విరాళంగా తన అనుచరులతో ఆలయ కమిటీ సభ్యులతో గురువారం గ్రామస్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ చలపాటి చంద్ర, జనసేనపార్టీ యువ నాయకులు దేరంగుల శ్రీకాంత్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ సుధా మురళి, అవ్వారు రవిశంకర్, నూకల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట ఎస్‌ఐగా శ్రీనివాసులు

ఒంటిమిట్ట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట ఎస్‌ఐగా వి.శ్రీనివాసులును నియమించారు. కడప వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ముందుగా ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ శివప్రసాద్ ఏడు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఒంటిమిట్టకు ఎస్‌ఐగా ఎవరూ నియమించలేదు. ఇప్పటికి వీఆర్‌లో ఉన్న వి.శ్రీనివాసులను ఒంటిమిట్ట ఎస్‌ఐగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయండి

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కల్యాణదుర్గం పట్టణం హిందూపురం రోడ్డు బైపాస్ సర్కిల్‌లో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న భక్త కనకదాసు 9 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురబల సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది ఈశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కలెక్టర్, ఎస్పీ హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే అనంతపురం జిల్లాలోని శాసన సభ్యులు, ఎంపీలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని కురబ కులస్తులందరూ విగ్రహావిష్కరణలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

రైల్వేకోడూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీ శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, వరప్రసాద్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో, పేటీఎం, టీవీఎస్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, అర్హత కలిగిన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వాటర్ షెడ్లు.. రైతుకు ఎంతో ఉపయోగం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు6(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ల వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం బి.యర్రగుడి (పీయంకేఎస్‌వై 2.0)లో భాగంగా రూ.45 కోట్లతో 2347 వాటర్ షెడ్ పనులు పూర్తి చేసుకుని జాతికి అంకితం చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాటర్‌షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం మాట్లాడుతూ గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో వాటర్ షెడ్డు పనులు చేపట్టడం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ లక్ష్మీనరసయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, వీవో వెంకట్రామిరెడ్డి, జేఈఈ నరసింహారెడ్డి, పీవోపీ వెంకట్రమణ, దామోదర్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శంకరపు జయరాం, నీటి సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సురేంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

● మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు అందజేసిన విద్యార్థులకు భోజనపు ప్లేట్లు, పంచాయతీ కార్మికులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, ప్రభాకర్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మాజీ ఎంపీటీసీలు చిన్న పరెడ్డి, పాపేసాబ్, శేషారెడ్డి పాల్గొన్నారు.

23న భగవద్గీత కంఠస్థ పోటీలు

రాజంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని ఈనెల 23వ తేదీ ఆదివారం రాజంపేట మన్నూరు ఉన్నత పాఠశాలలో భగద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అధికారి గోపిబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక మన్నూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సంగరాజు శారదతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. 6-9 సంవత్సరాలలోపు విద్యార్థులు భగవద్గీతలోని 14వ అధ్యాయం, గుణత్రయ విభాగం, 10-12వ తరగతి విద్యార్థులు 16వ అధ్యాయంలోని దైవాసుర సంపద్విభాగ యోగం శ్లోకాలను పఠనం చేయాల్సి ఉందన్నారు. 18-45 సంవత్సరాల వయస్సు వారు భగవద్గీత భావ విశ్లేషణ అంశంపై పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ఈనెల 20వ తేదీలోపు పేర్లను 911077 9066 నంబరుకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో నాగిరెడ్డిపల్లె విద్యార్థుల ప్రతిభ

నందలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పెద్దరామయ్యగారి లక్ష్మీదేవి, సయ్యద్ ఉమర్, ఉస్మాన్, ఆలీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల కడపలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో లక్ష్మీదేవి డిస్కస్‌త్రో విభాగంలో, ఉమర్ ఉస్మాన్, ఆలీ షాట్‌పుట్ విభాగంలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతిప్రియ, గీతా, మస్తాన్, ఆర్వీ రమణమ్మ, రాజేంద్ర, గొంటుముక్కల వెంకటరమణ, సురేష్, సంపత్, పవన్‌కుమార్, గాయత్రిదేవి, షాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ

మానవ సేవే రెడ్‌క్రాస్ ధ్యేయం


ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మానవ సేవే రెడ్‌క్రాస్ ధ్యేయమని, సభ్యులందరూ సేవా భావంతో పనిచేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో త్వరలో రక్తనిధిని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. సభ్యులు వారి వారి ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రెడ్‌క్రాస్ సభ్యులందరూ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సామాజిక సేవ చేయాలనే ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. సభ్యులందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టాలన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నాషరీఫ్, ట్రెజరర్ వేణుగోపాల్, సభ్యులు మడితాటి నరసింహారెడ్డి, డాక్టర్ మహేశ్వర్ రాజు, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డీఆర్ జగదీశ్, ఐపీఎల్ క్రికెట్ ప్లేయర్ (సీఎస్‌కే) హరిశంకర్, అంతర్జాతీయ ఫెన్సింగ్ చాంపియన్ కుమారి బేబి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌ఎం, ఎంఈవో

రాజంపేట టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్‌స్వారో, రాజంపేట ఎంఈవో సుబ్బరాయుడు అన్నారు. గురువారం మన్నూరు హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన విజిలెన్స్ కార్యక్రమానికి వీరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతికి సహకరించడం, భాగస్వామి కావడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలపై దృష్టి పెట్టకుండా మెదడుకు పదును పెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. రోజురోజుకు సైబర్‌నేరగాళ్ల మోసాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. విద్యార్థులు తమ చుట్టూ ప్రజలకు అవినీతిపై, సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు నిఘా ఉంచకపోతే చెడు వ్యసనాలకు బానిసయ్యే ప్రమాదం ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్లు కె.నాగేశ్వర, నవనీశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు కె.పరిమిళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతో విజయం తథ్యం

● సినీ నటుడు కేవీ ప్రదీప్



మాట్లాడుతున్న సినీనటుడు ప్రదీప్

రాజంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాంతో ఎంతటి విజయాన్నినైనా సాధించవచ్చునని సినీనటుడు కేవీ ప్రదీప్ అన్నారు. గురువారం రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఓరింటియేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్య సాధనలో ఆత్మవిశ్వాసం ముఖ్యమన్నారు. నిర్లక్ష్యధోరణి మాని సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే ఎంతటి కష్టమైన పనినైనా సాధించుకోవచ్చునన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. అన్నమాచార్య విద్యాసంస్థల అదినేత, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఉన్నత స్థానానికి చేరాలంటే క్రమశిక్షణ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ సీఎండీ ఆదేశాల మేరకు ప్రజల్లో విద్యుత్ సరఫరా ప్రజాభిప్రాయ సేకరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు గురువారం తెలిపారు. విద్యుత్ సేవలు మెరుగుపడేలా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. రోజువారీగా కింది స్థాయి నుండి పైస్థాయి వరకు విద్యుత్ సరఫరా సక్రమంగా ఉందా లేదా, అధిక వోల్టేజ్, లోవోల్టేజ్ ఉందా, సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అనే అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అభిప్రయాలను నమోదు చేసి రిపోర్టు తయారు చేసి పైఅధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

రాయలకాలం నాటి సంప్రదాయ రీతులు మళ్లీ రావాలి

● ప్రముఖ నాట్య గురువు నటరాజ కృష్ణమూర్తి


నటరాజ కృష్ణమూర్తితో రాజు సీబీఎస్సీ స్కూల్ విద్యార్థులు, సిబ్బంది

రాయచోటిటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు లలిత కళలకు ఆనవాలమైన రాయచోటిలో మళ్లీ రాయలకాలం నాటి సంప్రదాయ రీతులు రావాలని ప్రముఖ నాట్య గురువు, ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ మాజీ సభ్యుడు నటరాజ కృష్ణమూర్తి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని రాజు సీబీఎస్సీ హైస్కూల్‌లో హైదరాబాద్‌కు చెందిన సంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అపురూపమైనదమ్మ ఆడజన్మ' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆడజన్మ ఆవశ్యకతను వివరిస్తూ లలిత కళలు ఏ విధంగా దోహదపడతాయో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రానున్న జనవరి 23, 24, 25 తేదీల్లో సంస్కృతి ఉత్సవాలు నిర్వహించబోతున్నామని, అలాగే కడపలోని యోగివేమన యూనివర్శిటీ ద్వారా రాయచోటి పట్టణంలో సంగీత నాట్యాల్లో సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల కోసం జనవరి నెలలో ఒక సంగీత కళా కేంద్రం ఏర్పర్చబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి, ప్రముఖ సంగీత విద్వాంసుడు చక్రపాణి, రాజు విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జనీశ్‌రెడ్డి ప్రదర్శించిన అద్భుతమైన కూచిపూడి నాట్య ప్రదర్శన అలరించింది.

గ్రామాల అభివృద్ధికి అధికారులు తోడ్పడాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ అధికారులు తోడ్పడాలని రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట రెడ్డివారిపల్లె పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని, ఆ గ్రామ మహిళలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పబ్లిక్ బోర్లు, చేతిపంపులు చెడిపోయి నెలలు గడుస్తున్నా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం నెలలో ఒక్కరోజైనా పంచాయతీ వీధుల్లో దోసెడు బ్లీచింగ్ పౌడర్ చల్లారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం తెస్తానని చెప్పి పంచాయతీలను నిర్వీర్యం చేసి ఆ వ్యవస్థను నాశనం చేశారన్నారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య, శానిటేషన్, వీధి దీపాలు, డ్రైనేజీ కాలువలు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండు చేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

గాలివీడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గొట్లమిట్ట శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో భజన, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం 18 పడిమెట్లకు పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజలు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.


పడిపూజ నిర్వహిస్తున్న మాలధారణ భక్తులు

ప్రత్యామ్నాయ పంటల సాగుకు 250 క్వింటాళ్ల ఉలవలు మంజూరు

రామాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీ కింద మండలానికి 250 క్వింటాళ్ల ఉలవలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగమణి తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 10 కేజీలు రూ.550 కాగా రైతు వాటా రూ.112 చెల్లిస్తే సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.448 భరిస్తుందన్నారు. ఉలవ పంట సాగు చేయదల్సిన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల వద్దకు ఆధార్‌కార్డు, భూమి పట్టాదారు పాసుబుక్కు తీసుకెళ్లి రైతు వాటా చెల్లించి ఉలవలు తీసుకోవాలన్నారు. శుక్రవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అత్యవసర సమాచారం కోసం ప్రత్యేక ఫోన్ నంబరు

రాజంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధిలోని రాజంపేట, కోడూరు నియోజకవర్గ ప్రజలు ఏదైనా అత్యవసర సమాచారం తెలపాలన్నా, ఫిర్యాదు చేయాలన్నా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ఫోన్ నంబరు ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ భావన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9441344273 నంబరుకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు సమచారం లేదా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజల నుంచి అందిన పిర్యాదు మేరకు సంబంధిత అధికారులు పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శక్తి యాప్‌తో తక్షణ రక్షణ

పుల్లంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాధారణ పౌరులు, విద్యార్థినులు ఆపదలో ఉన్నప్పుడు పోలీసుల సహాయం పొందేందుకు శక్తియాప్ ఎంతో ఉపయోగపడుతుందని శక్తి టీం వివరించింది. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత భద్రత భవిష్యత్ లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని, ప్రతిఒక్కరు శక్తి యాప్ ఉపయోగించుకోవాలన్నారు. అంతేగాకుండా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ మైనర్లు వాహనాలు నడపడం తీవ్ర నేరమని, అలా నడిపి పట్టుబడితే వాహన యజమానులు లేదా తల్లిదండ్రులపై కేసు నమోదు అవుతుందని, అలాగే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తారన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల యువత జీవితాలు, వారి ప్రవర్తన చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. బాలల భద్రతకు సంబంధించి పోక్సో చట్టం, మహిళల పట్ల జరిగే నేరాలు, సైబర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, శక్తి టీం లీడర్ ఖాన్, రాజేశ్వరి, కల్పన పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఓబులవారిపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా భూ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు యామిని హెచ్చరించారు. మండల పరిధిలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీకి సంబంధించి పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు గురువారం జడ్‌హెచ్‌డీసీ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న 1907 సర్వేనంబరు భూమి సరిహద్దులను సర్వేయర్, వీఆర్వోతో కలిసి ఆమె పరిశీలించారు. అదే నంబరుకు ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించిన భూమిని పరిశీలించారు. 1907సర్వే నంబర్‌కు సంబంధించి ఆధారాలను రెవెన్యూ సిబ్బందికి అందించాలని అనుభవదారుడికి సూచించారు. అలాగే ఆ భూమిలో ఉన్న గృహనిర్మాణదారులకు కూడా సంబంధిత పత్రాలు చూపాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముంపు వాసులకు న్యాయం చేసేందుకు కృషి : తహసీల్దారు

సిద్దవటం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉద్దిమడుగు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయి నష్టపరిహారం అందని ముంపువాసులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తహశీల్దార్ తిరుమలబాబు అన్నారు. మండల పరిధిలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ మందపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న భూములను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దిమడుగు ప్రాజెక్టు పరిధిలో ఉన్న భూములకు గతంలో కొంతమంది రైతులకు ముంపు పరిహారం పొందారన్నారు. వారిలో ఇంకా ఎంతమంది పొందనివారు ఉన్నారు, ఎన్ని ఎకరాల భూమి ఉంది, డీకేటీ ఎంత, పట్టా ఎంతమేర ఉందని సర్వే చేశామన్నారు. మిగిలిన రైతులకు పరిహారం అందేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రాజంపేట విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న కొండూరు శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల అధినేత కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగే వాలీ బాల్ టోర్నమెంట్‌కు సి.భావన, కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పి.దీపిక, కడపలో జరిగే లాంగ్‌జంప్ పోటీలకు పి.లావణ్య, జి.ప్రణతి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో సీఈవో శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు, క్విజ్ పోటీలను నిర్వహించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి తెలిపారు. జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 25 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రాయచోటి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెకండ్ ఇయర్ హెచ్‌ఈసీ విద్యార్థిని షేక్ అబ్దుల్‌మిస్బా, సెకండ్ ఇయర్ సీఈసీ విద్యార్థిని హస్న, గుర్రంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ హారికను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు జోనల్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

భారీ వర్షం కారణంగా తగ్గిన భక్తుల రద్దీ

సిద్దవటం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి రోజున నిత్యపూజేశ్వరకోనకు శివభక్తుల రద్దీ తగ్గిందని ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ నిత్యపూజేశ్వరకోనలో కురిసిన భారీ వర్షం వల్ల వంకలు పొంగి ప్రవహించాయని, దీంతో భక్తుల సంఖ్య తగ్గిందని తెలిపారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారి మరమ్మతులపై కడప ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడామని, త్వరలో పనులు మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

పీలేరుకు డయాలసిస్ సెంటర్..

● ఫలించిన వైద్యుడి కృషి ● ప్రారంభానికి సన్నాహాలు ముమ్మరం ● దాదాపు 200 మందికి ప్రయోజనం

పీలేరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దశాబ్దం క్రితం వరకు కంటి శస్త్ర చికిత్సలకు లయన్స్ క్లబ్ పెట్టింది పేరు. ఎంతో క్లిష్టమైన కంటి జబ్బులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగానే చికిత్స అందేది. కాలానుకుణంగా చిన్న, మధ్య తరహా ఊళ్లలో కూడా కంటి వైద్యం అందరికీ అందుబాటులోకి రావడంతో లయన్స్ క్లబ్‌పై ఒత్తిడి తగ్గింది. దీంతో సేవలు మరింత విస్తృతం చేయాలని పీలేరుకు చెందిన ప్రముఖ వైద్యుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్ సంకల్పించారు. అందులో భాగంగా పీలేరులో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆలోచించారు. ఆలోచనతో సరిపెట్టుకోకుండా క్లబ్ సహచరులను వెంట బెట్టుకుని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసి, పీలేరుకు డయాలసిస్ కేంద్రం అవసరం ఉందన్న బీజాన్ని వారిలో నాటారు. డాక్టర్ ప్రసాద్ ఆలోచన, పీలేరు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల విజయభాస్కరరెడ్డి ప్రయత్నం, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవ ఫలించి పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరైంది. ప్రధాన మంత్రి జాతీయ డయాలసిస్ ప్రోగ్రాం (పీఎంఎన్‌డీపీ) ద్వారా పీలేరుకు డయాలసిస్ కేంద్రం మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అక్టోబరు 21న ప్రకటించారు. దీంతో పీలేరు ప్రాంతంలోని 200 మంది డయాలసిస్ రోగులకు ప్రయోజనం కలుగనుంది. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్న మంత్రి ప్రకటనకు అనుగుణంగా పీలేరులో కేంద్రం నిర్వహించేందుకు అపోలో ఆసుపత్రుల యాజమాన్యం ముందుకు వచ్చింది. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది.

విస్తృత వైద్య సేవల కోసమే..



లయన్స్ క్లబ్ ద్వారా విస్తృతమైన వైద్య సేవలు సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు పూనుకున్నాం. మా ప్రయత్నం ఫలించి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావడంతో ఎంతో సంతోషంగా ఉంది.

- డాక్టర్ టీవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్

ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు ..



మా ప్రయత్నాలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. అసెంబ్లీలో ఆయన మాట్లాడిన తర్వాతనే సెంటర్ ఏర్పాటు ప్రక్రియలో వేగం వచ్చింది. ప్రసాద్ ఆలోచనతో ఎంతో మందికి మేలు జరగనుండడంతో ఎంతో ఆనందంగా ఉంది.

- చింతల విజయభాస్కరరెడ్డి,
పీలేరు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి

పీలేరు పరిసరాల్లో 200 మంది రోగులు

శరీరంలోని వ్యర్థాలను కిడ్నీలు వడపోత చేస్తాయి. ఒకరోజులో దాదాపు 180 లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయని అంచనా. అధిక రక్తపోటు, దీర్ఘకాలిక మధుమేహం, కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు, మితిమీరిన మందుల వినియోగం వంటి కారణాలతో కిడ్నీలు పాడవుతుంటాయి. ఇలాంటి సమస్యతో బాధపడుతున్న వారి రక్తాన్ని ప్రత్యేక యంత్రం ద్వారా శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను డయాలసిస్ అంటారు. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు సార్లు లేదా నాలుగు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. దీర్ఘకాలికంగా కిడ్నీ జబ్బులున్న వారికి జీవితాంతం డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలతోపాటు చిత్తూరు జిల్లా సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన 200 మంది తిరుపతిలోని స్విమ్స్‌తోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతి వారం డయాలసిస్ చేయించుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డయాలసిస్ ఉచితంగా లభిస్తున్నప్పటికీ పీలేరు నుంచి తిరుపతికి వెళ్లేందుకు రోగులు ఆపసోపాలు పడుతుంటారు. డయాలసిస్ కేంద్రాలు 24గంటల ప్రాతిపదికన నడుస్తుండడంతో నిర్వాహకులు ఎప్పుడు చెబితే అప్పుడు అక్కడకు వెళ్లాల్సి ఉంటుంది. కొంత మందికి పగలు స్లాట్ దొరికితే, కొంత మందికి రాత్రి పూట దొరుకుతూ ఉంటుంది. ఆ సమయంలో వాహనాలు సమకూర్చుకుని, వెంట సహాయకులను తీసుకెళ్లాల్సి ఉంటుంది. దీంతో డయాలసిస్ సేవలు ఉచితంగా అందుతున్నా ఒక్కో సిట్టింగ్ కోసం బాధితులు రూ.2500ల నుంచి రూ.4 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. పీలేరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ఆ ఖర్చులు గణనీయంగా తగ్గిపోతాయని పలువురు బాధితులు తెలిపారు.



తిరుపతి స్విమ్స్‌లోని డయాలసిస్ వార్డు (ఫైల్ ఫొటో)

లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రి నిర్వహించేందుకు పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో రూ.1.50 కోట్ల వ్యయంతో అధునాతన భవనం నిర్మించారు. ఆ భవన నిర్మాణానికి డా.ప్రసాద్ దాదాపు రూ.40 లక్షల స్వంత నిధులు వెచ్చించారు. ఆ భవనంలోనే కొన్ని మార్పులు చేసి డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ భవనంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అటు ప్రభుత్వం, ఇటు అపోలో సంస్థ అంగీకరించింది.

ఒకటిన్నర నెల క్రితం ఆ సంస్థ ప్రతినిధులు భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం 32 కిలోవాట్ల జనరేటర్, ఒక నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేయమని అపోలో సంస్థ కోరగా, దాదాపు రూ.10లక్షలు వ్యయమయ్యే ఆ వసతులు కల్పించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు అంగీకరించారు. దీంతో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి మార్గం సుగమమైంది. సుమారు ఒక నెల రోజుల్లో అక్కడ డయాలసిస్ సేవలు ప్రారంభం అవుతాయని లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల విజయ భాస్కర రెడ్డి తెలిపారు. తొలుత మూడు బెడ్ల సౌకర్యంతో ప్రారంభమయ్యే సేవలు, 15 బెడ్‌ల వరకు పెరుగుతాయని, ఆ కేంద్రాన్ని అపోలో సంస్థ ఐదేళ్ల వరకు నిర్వహిస్తుందని ఆయన వివరించారు.



డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్న భవనం

ఖర్చులు తగ్గిపోతాయి..



ఒక సిట్టింగ్‌కు తిరుపతికి పోయి రావడానికి రూ.3 వేల నుంచి రూ.4 వేల దాకా ఖర్చు అవుతుంది. సెంటర్ నిర్వాహకులు ఎప్పుడు సమయం ఇస్తే అప్పుడు వెళ్లాలి కాబట్టి రాత్రి పూట వెళ్లాలంటూ ఇబ్బందిగా ఉంటుంది. అందుకని కారు తీసుకెళ్లాలి. పీలేరులో డయాలసిస్ సెంటర్ వస్తే ఆ ఖర్చు కూడా తగ్గిపోతుంది. మిగిలే ఆ నాలుగు డబ్బులు కుటుంబం కోసం ఖర్చు చేసుకోవచ్చు.

- సాయి సత్యం, డయాలసిస్ రోగి, పీలేరు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

● పోస్టర్లు ఆవిష్కరించిన సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ కల్యాణి

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో పది ప్రైవేటు సంస్థలతో నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి 9553202509, 6301612761 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

● డీఎల్‌డీవో లక్ష్మీకాంతం

రామాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని డీఎల్‌డీవో లక్ష్మీకాంతం గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దిబ్బలు, చెత్తాచెదారాలు లేకుండా శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. వీధుల్లో చిన్న చిన్న గుంతలు ఉన్నచోట నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటివి రాకుండా చూడాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లోని చెత్తను సంపద కేంద్రాలకు తెచ్చి పొడి, తడి చెత్తలుగా వేరు చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చెంబకూరు విద్యార్థి



తరుణ్‌కుమార్ రాజు

రామసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఎంపికల్లో చెంబకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి జె.తరుణ్‌కుమార్‌రాజు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతి ఎస్వీ క్రీడామైదానంలో గురువారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో అండర్-17కు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. పీడీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఈనెలలో పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తరుణ్‌కుమార్‌రాజు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. తరుణ్‌ను పాఠశాల హెచ్‌ఎం రమేశ్‌బాబు, పీడీ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులను విస్మరిస్తే ప్రభుత్వానికి మనుగడ ఉండదు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను విస్మరిస్తే ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, ప్రధాన కార్యదర్శి నాసర్ అన్నారు. గురువారం స్థానిక జీఆర్‌టీ హైస్కూల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సుయాత్ర సభలో వారు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర సాగుతోందని, ఇందులో భాగంగా 16వ రోజు మదనపల్లెకు చేరుకుందన్నారు. ఎన్నికల సమయంలో విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చిన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే సమస్యలకు పరిష్కారం చూపడం లేదన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని చెప్పిన మంత్రి లోకేశ్ ఏడాదిన్నర దాటినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అమలు చేస్తామనడం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమేనన్నారు. ఈనెల 12వ తేదీన అనంతపురంలో ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ నాగభూషణం, భవిత, ప్రవీణ్‌కుమార్, అభినయ్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్యారంపల్లెలో నగలు చోరీ

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్యారంపల్లెలో బుధవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన దాదిని లోకనాథ్ బుధవారం మధ్యాహ్నం పొలం పనుల నిమిత్తం వ్యవసాయ భూముల వద్దకు వెళ్లిన సమయాన గుర్తుతెలియని దుండగులు ఇంటి ఆవరణలో దాచిన తాళాలను తీసుకుని చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం చీకటి పడ్డాక ఇంటికి వచ్చి గమనించిన లోకనాథ్ కుమార్తె మౌనిక తల్లిదండ్రులకు విషయం తెలిపింది. ఇంటి బీరువా తాళాలు పగులగొట్టి అందులోని రూ.2లక్షల 60వేలు విలువ చేసే బంగారు నగలను దుండగులు అపహరించుకుపోయారు. దాదిని లోకనాథ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి



తుఫానుతో నష్టపోయిన పంటలు పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం సహా అన్నమయ్య జిల్లాలో మొంథా తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ తెలిపారు. గురువారం తాటిగుంటపల్లె, మూరేవాండ్లపల్లె, టేకలకోన గ్రామాల్లో టమోటా, బొప్పాయి పంటలను పరిశీలించారు. తుఫాను సృష్టించిన బీభత్సంతో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులను, తుఫాను బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ దేవర, జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

11 మంది జూదరులకు జైలుశిక్ష

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ 2021లో పోలీసులకు పట్టుబడిన 11 మంది జూదరులకు తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు. ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండల పరిధిలో పలువురు పేకాట ఆడుతూ 2021లో 11 మంది పట్టుబడ్డారు. దీంతో ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అప్పటి ఎస్ఐ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో పూర్వాపరాలను విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావడంతో 11 మందికి 7 రోజుల జైలు శిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు తెలిపారు. జరిమానా కట్టని పక్షంలో మరో 30 రోజులు అదనంగా సాధారణ జైలు శిక్ష విధించినట్లు జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారుల బృందం

పీలేరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల పర్యవేక్షకుల బృందం పరిశీలించింది. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మెయిన్, బాలికల పాఠశాల, కోటపల్లె జడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లను తనిఖీ చేశారు. విద్యార్థుల అవసరాల మేరకు సరిపడా ఫర్నీచర్, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, వెంటిలేషన్ మొదలగు వాటిని పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో టెన్త్ విద్యార్థుల ప్రిపరేషన్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, బోధన తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చక్కటి ప్రణాళికతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిశీలన బృందంలో ప్రభుత్వ పరీక్షల పర్యవేక్షకులు శ్రీనివాసరాజు, మదనపల్లె ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ రవికుమార్, పరీక్షా విభాగం సిబ్బంది నాగరాజు, హెచ్ఎంలు ప్రేమరాణి, రేణుకాదేవి, జయపాల్ రెడ్డి, బాబు, శివ శంకరయ్య, సీఆర్‌పీ జే. మురళీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మదనపల్లె అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 15, 16న తేదీల్లో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పివిరమణ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై రాజీ పడకుండా ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పోరాడుతోందన్నారు. రెగ్యులర్ చేస్తామని పాలకుల హామీల కోసం హక్కుల సాధన కోసం, పనికి సమాన వేతనం పొందడానికి మళ్లీ పోరాటాలకు నాంది పలికామన్నారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె బి.కొత్తకోట మున్సిపల్ వర్కర్స్ హాజరై రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ రాజు, జిల్లా నాయకులు గంగయ్య, గోపాల్, శ్రీరాములు. శ్రీనాథ, రామకృష్ణ, కృష్ణప్ప, వెంకటరమణ, పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

నిమ్మనపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల వేలం ద్వారా రెడ్డివారిపల్లి పంచాయతీకి రూ.64 వేల ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో రమేశ్ తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపల చెరువులను వేలం వేశారు. పంచాయతీలో మొత్తం ఐదు చెరువులను వేలం వేస్తే సీతమ్మచెరువు రూ.25 వేలు, వీరప్పచెరువు రూ.22 వేలు, బొడికిందరాయుని చెరువు రూ.12 వేలు, దాసరివానికుంట రూ.3 వేలు, మొరపు కుంట రూ.2 వేలకు పాటదారులు దక్కించుకున్నారు. మొత్తం పంచాయతీకి రూ.64 వేలు ఆదాయం వచ్చిందని దీనిని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించనున్నట్లు తెలిపారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ చెరువులు పాడుకొన్న లబ్ధిదారులు చెరువుల్లో కేవలం చేపలు మాత్రమే పట్టి అమ్ముకోవచ్చని ఇతరత్రా పనులకు ఉపయోగించరాదన్నారు. చెరువుకు ఇచ్చిన సమయం అయిపోగానే తిరిగి వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన

ఐదుగురికి జైలుశిక్ష

రాయచోటిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తేజస్విని నలుగురికి ఒక్కొక్కరికి రూ.11 వేలు చొప్పున జరిమానా విధించడంతో పాటు మరో ఐదుగురికి ఒక్కొక్కరికి మూడు రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీసులు సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెలలో పట్టుబడిన 9 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి డ్రంకెన్ డ్రైవ్‌కు పాల్పడిన వారికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సీఐ తెలియజేశారు. సమాజ శ్రేయస్సు దృష్ట్యా రోడ్డు భద్రత అవగాహనలో భాగంగా పోలీసులు ఎన్నిసార్లు సూచనలు చేసినా పెడచెవిన పెట్టి రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తూ నాకేం కాదులే అనే ఉద్దేశ్యంతో వాహనాలు నడిపే వారికి ఇదొక గుణపాఠం అన్నారు. భవిష్యత్తులో కూడా మీ శ్రేయస్సు మీ కుటుంబ శ్రేయస్సు సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మరింత పటిష్టంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి భవిష్యత్తులో మరింత జైలుశిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

గాలివీడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లచెరువు పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డిల సమక్షంలో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. ముందు నుంచి పార్టీని నమ్ముకున్న వారికి, కొత్తగా చేరుతున్న వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అందరూ సమన్వయంగా కలిసి మెలిసి పార్టీ అభివృద్ధికి పాటుపడడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉదయ్ కుమార్, నాగేశ్వర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మండిపల్లి సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న నాయకులు, ప్రజలు

బంగారు భవిష్యత్తుకు వేదిక గ్రంథాలయాలు

● రూ.2 లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు ● పాఠశాల అభివృద్ధికి దగ్గుబాటి సాయం



ఎస్ఐకి సీసీ కెమెరాలను అందిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కలకడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు గ్రంథాలయాలు చక్కని వేదికని దగ్గుబాటి వెంకటేశ్వరరావు, డీవైఈవో లోకేశ్వరరెడ్డి అన్నారు. గురువారం బాటవారిపల్లె హైస్కూల్ గ్రంథాలయానికి లయన్స్ క్లబ్ తరపున లయన్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, రజనీకుమార్, బరకం శ్రీనివాసులరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఇతర దాతలు రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చారు. పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభ సమావేశంలో డీవైఈవో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దగ్గుబాటి వెంకటేశ్వరరావు సొంతంగా రూ.11 లక్షలు ఖర్చు చేసి సమాజ సేవకు అంకితమయ్యారని కొనియాడారు. విద్యార్థుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ తరపున రూ.8 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కంకణం కట్టుకున్న గొప్పవ్యక్తుల దాతృత్వం చిరకాలం నిలిచిపోతుందని వక్తలన్నారు. ఎంవీ రాప్స్ చిట్స్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల భద్రత, రక్షణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విలువైన సోలార్ సీసీ కెమెరాలను ఎస్ఐ రామాంజనేయులుకు అందజేశారు. అనంతరం దగ్గుబాటి మాట్లాడుతూ తన సాయశక్తులా కృషి చేసి రాబోయే రెండేళ్లలో మూడు మండలాల ప్రజలకు అనువుగా లయన్స్ ఆస్పత్రి, దాతల సహకారంతో ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా దగ్గుబాటిని హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల పరిశీలకుడు శ్రీనివాస్‌రాజు, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంఈవో మునీంద్రనాయక్, హెచ్‌ఎంలు, లయన్‌లు హరినాథ్‌నాయుడు, ప్రసాద్, అబ్బూరి తిరుపతి నాయుడు, పునీత్‌చౌదరి, హరినాథ్ నాయుడు, వైవీ రమణ, ఉపాధ్యాయులు లోకా జగన్నాథశాస్త్రి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయం ప్రారంభంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల వయస్సు నిండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్‌యాదవ్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి సీఈవో వీసీ ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్ట్రోరల్ రోల్స్ (ఎస్.ఐ.ఆర్-2025)పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న ఎస్ఐఆర్-2025 కార్యక్రమంపై పలు సూచనలు, మార్గదర్శకాలు వర్చువల్ విధానంలో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాలో నమోదు చేపట్టాలన్నారు. అనర్హులను తొలగించడం, జాబితా పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సీఈవో సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుషావతి నదిలో ఇరుక్కున్న ఆటో

ట్రాఫిక్ జామ్..ఆగిన వాహనాలు



పెద్దమండ్యం కుషావతినదిపై నిలిచిన వాహనాలు

మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం కేంద్రానికి సమీపంలోని కుషావతినదిలో గురువారం లగేజీ ఆటో చిక్కుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కుషావతినది భారీగా ప్రవహించింది. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహానికి అక్కడున్న బ్రిడ్జి దెబ్బతిని కోతకు గురైంది. దీంతో స్థానికులు అక్కడ ఏర్పడిన గుంతలను పెద్దసైజు కంకర రాళ్లతో పూడ్చే ప్రయత్నం చేశారు. నీటి ప్రవాహనం కొనసాగుతుండడం, కిందివైపు కోత మరింత ఎక్కువై కంకర గోతిలో కుంచించుకు పోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిగా మారింది. అదే సమయంలో పెద్దమండ్యం నుంచి గుర్రంకొండ వైపు లగేజీ ఆటో రావడంతో అందులో కూరుకు పోయింది. ముందుకు, వెనక్కు వెళ్లలేకపోయింది. దీన్ని గట్టుకు చేర్చేక్రమంలో అటుగా వెళ్తున్న వాహనదారులు నెట్టడంతో సమస్య పరిష్కారమైంది. అప్పటికే రోడ్డుపై వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ జామ్ అయింది. ఇదిలావుండగా, మొన్నటి వర్షాలకు కూడా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రజలు, వాహనాల రాకపోకలు ఆగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడి నదిపై ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదన ఏళ్ల తరబడి అమలుకు కాకపోవడంపై స్థానికులు అటు అధికారులు, ఇటు పాలకులపై పెదవివిరుస్తున్నారు.

సర్వే చేయమన్నా... స్పందనే లేదు

● బసినికొండ వాసుల ఆవేదన



బసినికొండలో ఆక్రమణకు గురైన మురికినీటికాలువ

మదనపల్లె, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బసినికొండ కస్బాలోని ఆక్రమణకు గురైన మురికినీటి కాల్వను సర్వే చేయాలని అధికారులను కోరినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. బసినికొండ కస్బాకు ఉత్తరంవైపు డ్రైనేజీ కాల్వ ఉంది. దీన్ని స్థానికులు కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అలాగే ఉన్న కాల్వ కూడా పూర్తిగా వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది, స్థానికులు రోగాల బారిన పడుతున్నారంటూ గంగన్నగారిపల్లె టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డితో కలసి స్థానికులు ప్రజాపరిష్కారవేదికలో సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రికార్డుల మేరకు మ్యాపులో కాల్వగానే ఉంది. ఆక్రమణలు తొలగించి, సర్వే చేస్తే, పంచాయతీ అధికారులు కాల్వ నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారని వారు సబ్‌కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే సబ్‌కలెక్టర్ ఆదేశించినా మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం స్పందించలేదని బాబురెడ్డి వాపోతున్నారు. పైసలొచ్చే పనులు అయితే మాత్రం వెంటనే చర్యలు తీసుకుంటారని, ప్రజాసమస్యలపై స్పందించరని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు పేర్కొన్నారు.

రాక్ క్లైంబింగ్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ క్యాడెట్లు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంలో అడ్వెంచర్ క్యాంప్‌లు ఎంతో దోహదపడతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. కడప ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సయ్యద్ అలీ, మహమ్మద్‌లు నవంబరు 10 నుంచి 21వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగబోయే రాక్ క్లైంబింగ్ క్యాంప్‌నకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికయ్యారు. వీరిని గురువారం కళాశాల ప్రాంగణంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ సైనిక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో అడ్వెంచర్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్‌తో పాటు క్యాడెట్లు పాల్గొన్నారు.

తుమ్మణంగుట్ట వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు

బి.కొత్తకోట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని తుమ్మణంగుట్ట గ్రామ శివారుతో గుప్తనిధుల కోసం ఓ ముఠా తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తితో పరిచయం పెట్టుకున్న కోస్తా జిల్లాలకు చెందిన నలుగురు వ్యక్తులు ట్రాక్టర్ రిగ్గుతో ఈ తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో తవ్వకాలు జరిగాయి. అప్పట్లో ఈ విషయం బయటకు పొక్కకుండా సద్దుమణిగించారు. తాజాగా తుమ్మణంగుట్ట గ్రామానికి ఉత్తరం వైపు సంత రోడ్డులో రిగ్గుతో భూమికి రంధ్రాలు పెడుతుండడం చూసి గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

పౌరులకు సుపరిపాలనే కూటమి పాలన లక్ష్యం

● డేటా ఆధారిత పాలన సదస్సులో సీఎం



సీఎం వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వో

కడప కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని పౌరులకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం డేటా ఆధారిత పాలనపై ముఖ్యమంత్రి అధ్యక్షతన రాజధానిలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్, డీఎఫ్ఓ వినీత్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యత కావాలన్నారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకొని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేయడం వల్ల మొంథా తుపాన్ నుంచి ప్రాణ, ఆస్థి నష్టాన్ని బాగా తగ్గించామన్నారు. డేటా ఆదారిత పాలన అనేది ఇపుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించడం జరుగుతుందన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేయడం జరుగుతుందన్నారు.

చోరీ, చైన్‌స్నాచింగ్ కేసుల్లో ఇద్దరు అరెస్టు

● 21 తులాల బంగారు నగలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో ఇటీవల బంగారు దుకాణాల్లో జరిగిన చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను వన్‌టౌన్, త్రీటౌన్ పోలీసులు చేధించారు. ఆమేరకు గురువారం డీఎస్పీ భావన ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో నిందితుల అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణం పరిధిలోని మహబూబ్ షరీఫ్, పోలంకి మహేష్‌లకు చెందిన బంగారు అభరణాల దుకాణాలలో బంగారు నగలు చోరీ చేసిన దొంగను వన్ టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ రెండు దొంగతనాలు రాగా హరీష్ అనే దొంగ చేశాడన్నారు. ఇతనిది అనంతరపురం జిల్లా చెన్నెకొత్తపల్లె నామాల గ్రామం అని, ప్రస్తుతం కడప చిన్నచౌక్‌లో ఉంటున్నట్లు తెలిపారు. ఈరెండు చోరీలు చేసిన నిందితున్ని సీసీ కెమెరాల్లోని పుటేజీల ఆధారంగా గుర్తించామన్నారు. ఈ కేసులో మొత్తం 18.1 తులం బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే బుధవారం రాత్రి త్రీటౌన్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో ఇంటి ముందు అరుగుపై ఒంటరిగా కూర్చొని ఉన్న వృద్ధురాలు జానపాటి లక్ష్మీదేవి (72) మెడలో గొలుగును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారైన కేసులో షేక్ మౌలాలి (31) అనే నిందితుడిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతను ప్రొద్దుటూరు హోమస్‌పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతని వద్ద నుంచి 30గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. వీరందిరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, త్రీటౌన్ సీఐ వేణు గోపాల్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎస్ఎస్ఆర్ ఎడ్లు విజయం



బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బండలాగు పోటీల్లో ఎస్ఎస్ఆర్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.3లక్షల నగదు బహుమతి సాధించాయి. ధరణి తిమ్మాయపల్లె అవధూత కొండయ్యస్వామి 44వ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం వృషభరాజములచే రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కొండయ్యస్వామి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. తెలంగాణ హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, గాండీవ, వీర నరసింహారెడ్డిలకు చెందిన ఎస్ఎస్ఆర్ ఎడ్లు 2వేల 455 అడుగులు బండలాగి మొదటి స్థానంలో నిలిచి రూ.3లక్షల నగదు బహుమతి గెలుచుకోగా, కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి, తోట తిరుపాల్‌రెడ్డి, దుబ్బన్న, చెన్నకేశ వరెడ్డిలకు చెందిన ఎడ్లు 2 వేల 418 అడుగులు బండలను లాగి రెండో బహుమతి కింద రూ.2లక్షల నగదు అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతులను కొండయ్యస్వామి స్వయంగా విజేతలకు అందచేశారు.

గుప్తనిధుల వేటగాళ్లు పట్టివేత



గుప్తనిధుల వేటగాళ్ల కోసం గాలిస్తున్న గ్రామస్థులు, పట్టుబడిన వేటగాళ్లు దిలీప్‌రెడ్డి, శశికుమార్, శ్రీధర్

నంబులపూలకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలంలో గుప్త నిధుల వేటకు వచ్చిన ముగ్గురిని గ్రామస్తులు పట్టుకున్నారు. ధనియాన్‌చెరువు పంచాయతీ డి.గొల్లపల్లి సమీపంలో పురనాతన నరసింహస్వామి ఆలయం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం వద్ద రాత్రిపూట సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. ధనియాన్ చెరువు, పాతూరు గ్రామాలకు ఈ సమాచారాన్ని చేరవేశారు. రెండు గ్రామాల ప్రజలు గురువారం రాత్రి ఆలయాన్ని చుట్టుముట్టారు. ఆలయం వద్ద ఒక ఆటో, ద్విచక్రవాహనం ఉన్నట్లు గుర్తించారు. గ్రామస్తుల రాకను పసిగట్టిన ముఠా పారి పోయేందుకు ప్రయత్నించిది. వీరిలో శశికుమార్, శ్రీధర్‌ను ఆలయ సమీపంలో పట్టుకున్నారు. దిలీప్‌రెడ్డి అనే వ్యక్తి పారిపోగా వెంబడించి పొలాల్లో పట్టుకున్నారు. గ్రామస్థులు పట్టుబడిన వారిని నిలదీయగా, తమది అన్నమయ్య జిల్లా మదనపల్లి అని, గుప్త నిధుల తవ్వకాల కోసం ఐదుగురం వచ్చా మని ఒప్పుకున్నారు. పారిపోయిన వారిలో ఒక మహిళ, మరో వ్యక్తి ఉన్నారు. వారికోసం గ్రామస్తులు పొలాలు, గుట్ట ప్రాంతాల్లో గాలిస్తున్నారు. పట్టుబడినవారిని పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నారాయణరెడ్డి (ఫైల్)

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బోరు నారాయణరెడ్డి (78) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం నారాయణరెడ్డి స్కూటర్‌పై తమ గ్రామానికి వస్తూ.. దత్తాపురం గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా కడప నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈసంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. నారాయణరెడ్డికి భార్యతో పాటు, పెళ్లైన కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి సుందరయ్య కాలనీలో జూదమాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తి అరెస్టు

పోరుమామిళ్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించి మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన లక్కినేని దేవరాజ్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. తీరా పెళ్లికి నిరాకరించడంతో ఆ యువతి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

భార్యపై రోకలిబండతో దాడి

కొండాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉస్తికా యలపల్లెలో గురువారం వీరమ్మ అనే మహిళపై ఆమె భర్త శివరంగారెడ్డి రోకలిబండతో దాడి చేయడంతో తీవ్ర గాయా లయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా భార్య, భర్తలు దూరంగా ఉన్నారని, భూమి విషయమై మనస్పర్థల కారణంగా ఈ సంఘటన జరిగిందని తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు మైదుకూరు విద్యార్థి ఎంపిక

మైదుకూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రెజ్లింగ్ అండర్-14 విభాగంలో మైదుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న పాశం వెంకటనవీన్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు రామ్‌నాయక్, ఫాతిమా తెలిపారు. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి, ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంఈఓ పద్మలత, పాఠశాల హెడ్మాస్టర్ ఇలియాస్ అహమ్మద్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించిన నవీన్

రేపు జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పురుషుల, మహిళా జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ టి.నారాయణరావు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు, క్రీడాకారిణులు విజయనగరం జిల్లా కొండ వెలగడ గ్రామంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరుగనున్న ఏపీ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికలకు హాజరయ్యే వెయి ట్ లిఫ్టర్లు ఐడబ్ల్యుఎల్ఎఫ్ కార్డు కలిగి వుండాలన్నారు. క్రీడాకారులు తమ వివరాల కు సంబంధించి వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో సంప్రదించాలన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యశస్వి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా బీసీ సంక్షేమ, సాధికార అధికారి ఎం.అంజల ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు ఈ స్కీంకు అర్హులన్నారు. ఓబీసీ, ఈబీసీ విద్యార్థులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకో వచ్చని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 9, 10తర గతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 75 వేల రూపాయలు, ఇంటర్‌కు లక్షా 25వేల రూపాయల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తుందని వివరించారు.

నేడు విద్యార్థులకు నైపుణ్య పోటీలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు వృత్తి విద్యలో చేరిన విద్యార్థులకు జిల్లాస్థాయి నైపుణ్య పోటీలను సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్ తెలిపారు. జిల్లాలోని పాఠశాలస్థాయి పోటీల ద్వారా ఎంపికైన 206 ప్రాజెక్టులు శుక్రవారం కడప మాసాపేటలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ఘనంగా హాకీ శతవసంత వేడుకలు

మదనపల్లె అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హాకీ శత వసంత వేడుకలను మదనపల్లె మండలం సీటీఎం జడ్పీ హైస్కూల్‌లో జినరాజదాస హాకీక్లబ్, సీపీఎం హాకీ విద్యార్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ 100 ఏళ్ల హాకీ చరిత్రలో భారతదేశ హాకీ ఒలింపిక్స్‌లో 1928,1932,1936లో భారత హాకీ జట్టు బంగారు పతకాలను సాధించాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, జినరాజదశ హాకీక్లబ్ సభ్యులు నరేశ్‌బాబు మాట్లాడుతూ భాతరదేశ హాకీ, ఆంధ్రహాకీ అసోసియేషన్ ప్రారంభంలో మదనపల్లెలోని జినరాజదాస స్టేడియం, బీటీ కళాశాలలో ప్రారంభమైనట్లు తెలిపారు. సీటీఎం జిల్లా ఉన్నత పాఠశాల్లో విద్యార్థులు శతదినోత్సవాన్ని వందమంది వలయాకారంలో ప్రదర్శన చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్ నాయక్, భారతి, బాలకృష్ణనాయుడు, కృష్ణానంద, యోగరంజని, వినోద్, గౌస్. పవన్ తదితరులు పాల్గొన్నాస.

జాతి ఐక్యతకు, అభ్యున్నతికి కృషి చేస్తా

మదనపల్లె అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముస్లిం ఐక్యవేదిక అన్నమయ్య, కడప జిల్లాల గౌరవ సలహాదారులుగా డాక్టర్ ఎస్‌కే బాషా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ ప్రకటించారు. గురువారం నూతన సలహాదారులు డాక్టర్ ఎస్‌కేబాషా మాట్లాడుతూ ముస్లిం జాతి ఐక్యతకు, అభ్యున్నతికి కృషి చేస్తాన్నారు. విద్య, వైద్య, రాజకీయ, సామాజిక రంగాల్లో ముస్లింలను చైతన్య పరచడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ముభారక్, వావాజీ, ఖాదర్‌బాషాలు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం - ప్రయాణం నరకం

అధ్వానంగా కర్ణాటక సరిహద్దు గ్రామీణ రోడ్లు ● ఇక్కట్లలో వాహనచోదకులు
గుంతలమయం మద్దయ్యగారిపల్లె - చేలూరు రోడ్డు ● చెరువులను తలపిస్తున్న కందుకూరు - బెట్టకొండ రోడ్డు
● పనులు ప్రారంభిస్తామంటున్న పంచాయతీరాజ్ అధికారులు


అగ్రహారం వద్ద కందుకూరు - చేలూరు రోడ్డు

పెద్దతిప్పసముద్రం నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోనే అత్యంత వెనుకబడిన మండలం పెద్దతిప్పసముద్రం. మండలంలోని గ్రామీణ రోడ్లు గుంతలమయమై వాటికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కందుకూరు - బెట్టకొండ రోడ్డు గొడుగువారిపల్లె వద్ద అత్యంత అధ్వానంగా తయారై చెరువును తలపిస్తోంది. మద్దయ్యగారి పల్లె నుంచి కందుకూరు మీదుగా చేలూరుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై వాహన దారులను ఇక్కట్లకు గురిచేస్తోంది. మండలంలో కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు గ్రామాలైన అగ్రహారం, చెట్లవాండ్ల పల్లె, మారాగానిపల్లెకు, మరో వైపున అంకిరెడ్డి పల్లె నుంచి బెట్టకొండ వరకు నవాబుకోట, వరికసువు పల్లె రోడ్లపై ప్రయాణం చేయాలంటే సాహసించాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో పాలకులు విచ్చలవిడిగా టిప్పర్లతో అక్రమంగా ఇసుక, మట్టి తరలించడంతో గ్రామీణ రోడ్లు గుంతల మయమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్లను గాలికొదిలేయడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు ప్రయాణానికి సాహసమే చేయాల్సి వస్తోందని గ్రామీణ వాసులు ఆరోపిస్తున్నారు.

అస్తవ్యస్థం కందుకూరు- చేలూరు రోడ్డు


కందుకూరు - బెట్టకొండ మెయిన్‌రోడ్డు

మండలం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఉన్న మద్దయ్యగారిపల్లె నుంచి కందుకూరు మీదుగా చేలూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై కదిరి నుంచి బెంగళూరుకు నిత్యం 17 సర్వీసులు తిరుగుతుంటాయి. ఈ ప్రధాన రహదారిపై కందుకూరు సమీప అగ్రహారం వద్ద రోడ్డు పూర్తిగా గుంతల మయమైంది. దీంతో వర్షం వచ్చిందంటే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. సుమారు 15 కిలో మీటర్ల మేర అధ్వానంగా మారడంతో ప్రయాణానికి సుమారు గంట సమయం పడుతోంది. ఈ రోడ్డు ఆద్యంతం పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనచోదకుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఎంత జాగ్రత్తగా నడిపినా గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులతోనే కాలయాపన చేశారు. కనీసం ఈ ప్రభుత్వమైనా రోడ్లను బాగుచేయాలని కోరుతున్నారు.

అధ్వానంగా అంకిరెడ్డిపల్లె రోడ్డు

మండల కేంద్రం నుంచి బెట్టకొండ మీదుగా నాయనవారిపల్లె వరకు వెళ్లే అంకిరెడ్డిపల్లె రోడ్డు సుమారు 7 కిలోమీటర్లు ఉంది. ఈ రోడ్డు గుండా మండల కేంద్రానికి సుమారు 10 గ్రామాల ప్రజలు వెళ్లాలి. నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు తదితరాలు పెద్దతిప్ప సముద్రం మండల కేంద్రానికి రాక పోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిపై ఎక్కువగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి వెళుతుంటారు. పీటీఎం నుంచి మొత్తం రోడ్డు పూర్తిగా కంకర తేలిపోయింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం సాగించాలంటే అవస్థలు పడుతున్నట్లు వాహ నచోదకులు వాపోతున్నారు. రాత్రిళ్లు గుంతలు కనిపించక పోవడంతో వాహనాలు అదుపు తప్పి అనేక మంది ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. పూర్తిగా కంకర తేలిపోయిన అంకిరెడ్డిపల్లె రోడ్డు కొద్దిపాటి వర్షాలు పడ్డాయంటే మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రోడ్ల మహర్దశ కలుగుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కనీసం ఈ రోడ్లను మరమ్మతు చేసి ఇబ్బందులు లేకుండా చూడా లని ప్రజలు కోరుతున్నారు.


నీటితో మునిగిపోయిన అంకిరెడ్డిపల్లె రోడ్డు

చెరువుల్లా కందుకూరు- బెట్టకొండ రోడ్డు

కందుకూరు - గొల్లపల్లె మీదుగా బెట్టకొండ వరికసువుపల్లె వరకు ఉన్న రోడ్డు గొడుగువారి పల్లె వద్ద మెయిన్‌రోడ్డు చెరువును తలపిస్తోంది, దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కందుకూరు నుంచి టి.టి.సదుంకు వెళ్లాలంటే ఈ రహదారే ప్రధానమవడంతో అధిక సంఖ్యలో రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు గొడుగువారిపల్లె వద్ద రోడ్డుపై నీళ్లు పూర్తిగా నిలవడంతో ద్విచక్రవాహన దారులు ఆ నీటిలో పడి ప్రమాదాలకు గురవుతు న్నారు. పీటీఎం మండలంలోని కందుకూరు, అంకిరెడ్డిపల్లె, ఇంకా పలు గ్రామాల ప్రజలు టి.సదుం చేలూరుకు వెళ్లాలంటే ఈ రహదారి ద్వారానే వెళ్లాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నాయి. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా ఈ రోడ్లకు మోక్షం కలిగేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.


చెరువును తలపిస్తున్న పీటీఎం - అంకిరెడ్డిపల్లె రోడ్డు

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రహదారుల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించాము. మండలంలో ఉన్న గ్రామీణ రోడ్లు మండల కేంద్రానికి వెళ్లే లింకు రోడ్లను మొత్తం మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వానికి నివేదించాము. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తాము.

నిరంజన్‌రెడ్డి, ఏఈఈ, పంచాయతీరాజ్

శతకాలు సమాజ శ్రేయస్సుకు ఉపకరణాలు

● గౌరీ శతకం ఆవిష్కరణలో వక్తలు


గౌరీ శతకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

కలకడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శతకాలు సమాజ శ్రేయస్సుకు ఉపకరణాలని వక్తలన్నారు. గురువారం బాటవారిపల్లె హైస్కూల్‌లో అష్టావధాని లోకా జగన్నాథ శాస్త్రి రచించిన గౌరీ శతకం పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో డీవైఈఓ లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పఠనాభిలాషపై శ్రద్ధ చూపిన పద్యాలను కంఠస్థం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించే లక్ష్యంతో ఈ శతకం రచించినట్లు రచయిత లోకా జగనాథశాస్త్రి తెలిపారు. వేమన, సుమతి శతకాలు నేటికీ సమాజ ఆదరణ పొంది మానవ జీవన విధానాలను ప్రభావితం చేయడం గర్వకారణమన్నారు. జిల్లా పరీక్షల పరిశీలకుడు శ్రీనివాసులరాజు మాట్లాడుతూ లోకా జగన్నాథశాస్త్రి రచనలు సరళ సుందరంగానూ భావబంధంగా ఉంటాయని కొనియాడారు. రచయిత, గ్రంథప్రచురణకు సహకరించిన హెచ్‌ఎం వెంకట సుబ్బయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు వైవీరమణ, తెలుగు ఉపాధాయుడు బాబు రెడ్డిని సన్మానించారు. ఎస్‌ఐ రామాంజనేయులు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించిన అధికారులు


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

కలికిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లవోలు పంచాయతీ గడి గ్రామ రైతులు పొలాలకు వెళ్లేందుకు అడ్డంకిగా వున్న దారి సమస్యను రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు గురువారం పరిష్కరించారు. దశాబ్దాలుగా వున్న ఈ సమస్యను పరిష్కరిస్తేగానీ రైతులు పొలాలకు వెళ్లే పరిస్థితి లేదని టీడీపీ నేత షాబుద్దీన్ ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సర్వే చేసి సమస్యను పరిష్కరించి రైతులకు సహకరించాలని ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో డిప్యూటీ తహసీల్దారు సయ్యద్, మండల సర్వేయర్ రెడ్డెప్ప, వీఆర్వో సుల్తాన్ సర్వే చేయడంతో సమస్యకు పరిష్కారం లభించింది.

డయాలసిస్ కేంద్రం మంజూరుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్

బి.కొత్తకోట, నవంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రి(సీహెచ్‌సీ)కి డయాలసిస్ కేంద్రం మంజూరు చేయబోతున్నట్లు డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి ప్రకటనతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పలువురు బీజేపీ నేతలు సీహెచ్‌సీకి వెళ్లి మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌ను కలిసి డయాలసిస్ కేంద్రం మంజూరు విషయమై మాట్లాడారు. ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వ నిర్ణయం ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఈ కేంద్ర ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, బీజేపీ నేత చల్లపల్లి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మండల కన్వీనర్ ముకుంద, మురళి, కార్తీక్, ముబారక్ తదితరులు పేర్కొన్నారు.

ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరం పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ ముంతాజ్‌అలి జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. గురువారం జేసీఎం సమావేశ భవనంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం లో 15 మంది వైద్యులు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష సత్సంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆత్మగౌరవానికి భంగం కల్గిస్తే ఊరుకోము'


విలేకర్లతో మాట్లాడుతున్న సుధాకర్

మదనపల్లె టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గౌరవ ప్రదంగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు వైసీపీ నేతలు రాజకీయాలు అంటగట్టి వారి ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే ఊరుకోమని టీడీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుద్దిళ్ల సుధాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తుండగా, కొందరు కుహనా వైసీపీ నేతలు ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులను టార్గెట్ చేసుకుని వైసీపీ సర్పంచ్‌ల చేత సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారన్నారు. పంచాయతీ నిధుల లెక్కలు చూపకపోవడంతోనే ఇద్దరు సర్పంచులకు చెక్‌పవర్ పోయిందన్నారు. దీన్ని మనసులో పెట్టుకుని ఎంపీడీఓను టార్గెట్ చేసుకుని నాటకాలు ఆడుతున్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ సర్పంచులను ఆడిస్తున్న వారు వైఖరి మార్చుకోవాలని, లేకుంటే మండల ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. టీడీపీ గ్రామ కమిటీల నేతలు ఒ.శ్రీనివాసులు, ఎం.ప్రసాదనాయుడు, బి.సహదేవ, వై.రమేశ్, పి.వెంకటేశ్ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలంటూ సీపీఐ ఆందోళన

ములకలచెరువు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సోంపల్లె - ఏడుమడకల పల్లె రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని సీపీఐ నేతలు నిరసన వ్యక్తం చేశారు. సోంపల్లె కస్పాలో ఏర్పడిన గుంతల వద్ద గురువారం ఆందోళనకు దిగారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ సోంపల్లె నుంచి ఏడుమడకలపల్లె, దాశెట్టివారిపల్లె గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డుపై గుంతలు పడి అందులో నీరు నిలబడడంతో అధ్వాన్నంగా మారిందన్నారు. దీంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రోడ్డుపై పడిన గుంతలు పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షానికి రోడ్లపై గుంతలు

మదనపల్లె అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణం, గొల్లపల్లె బైపాస్ రోడ్డులో గుంతలు పడి రోడ్డు అధ్వాన్నంగా మారిపోయింది. బస్సులు, ఇతర వాహనాల రాకాపోకలకు ఇబ్బంది ఏర్పడింది. నడిరోడ్డులో గుంతలు పడి వర్షపు నీరు నిల్వ ఉండడంతో తెలియక వాహనదారులు కష్టాలు పండుతున్నారు. ఈ గుంతలను మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సమస్యను పసరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్

నిమ్మనపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ బారత దేశానికి ఎంతో మేలు చేశాడని ఎస్‌ఐ తిప్పేస్వామి అన్నారు. గురువారం జాతీయ ఐక్యతా దినోత్సవం విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ శ్రీప్రియ తదితరులు పాల్గొన్నారు.

పనులు కల్పించకుంటే తప్పుకోండి

పెద్దమండ్యం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) ఉపాధి ద్వారా కూలీలకు పనులు కల్పించకుంటే రాజీనామా చేసి తప్పుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్ రావు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం బండ్రేవు ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేసిన ఆయన ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించి బయోమెట్రిక్‌తో కూలీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. పండ్ల తోటలు మంజూరైన రైతులు వర్షాలకు సకాలంలో మొక్కలు నాటుకోవాలన్నారు. పండ్ల తోటలపై ఆసక్తిగల రైతులు దరఖాస్తు కోసం ఫీల్డ్ ఆసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. మండలంలోని ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. ఎస్టీ, ఎస్సీ కుటుంబాలకు వందశాతం పనులు కల్పించాలన్నారు. రైతులకు ప్రయోజనకర పనులు చేపట్టాలని ఆదేశించారు. జాబ్‌కార్డు వున్న కూలీలకు ఆయా ప్రాంతాల్లోనే పనులు కల్పిస్తామన్నారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి ఏపీఓ సురేంద్రారెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పెద్దతిప్పసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది పేర్కొన్నారు. గురువారం పీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రైతు సాధికార సంస్థ జిల్లా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టారు. మాస్టర్ ట్రైనర్ సి.రఘునాథ్, డిస్ట్రిక్ట్ మోడల్ మేకర్ ట్రైనర్ సుబ్బరాముతో కలిసి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేని కలిసిన నేతలు

పెద్దతిప్పసముద్రం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) పెద్దతిప్పసముద్రం టీడీపీ నేతలు ఉమ్మడి అనంతపురం జిల్లా పుట్టపర్తి, నల్లమాడ టీడీపీ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డిని కలిసి మాట్లాడారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో గురువారం వారు మాజీ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో త్వరగా టీడీపీ ఇన్‌చార్జ్ నియమించడానికి కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అనిశ్చితి పై వారు వివరించారు. తంబళ్లపల్లి నియోజకవర్గం రాజకీయ అంశాలపై మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. బి.కొత్తకోట సింగల్‌విండో చెర్మన్ దేరంగుల నారాయణ, పెద్దతిప్పసముద్రం సింగల్‌విండో మాజీ చెర్మన్ సంపతి కోట కిట్టన్న, బీసీ సెల్ నేతలు రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవల్లో ఇబ్బందులకు గురి చేయొద్దు


సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ మనోహర్‌రాజు

వాల్మీకిపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవల్లో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ మనోహర్‌రాజు అన్నారు. పట్టణంలోని మూడు సచివాలయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అనంతరం సచివాలయ సిబ్బందికి సూచనలిస్తూ విధుల్లో అలసత్వం చేయకుండా ప్రజలకు తక్షణ సేవలు అందించేలా చూడాలన్నారు. త్వరలో ఓబులంపల్లె, నగిరిమడుగు, గండబోయనపల్లె సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల్లో రికార్డులు తనిఖీ చేస్తూ సిబ్బంది విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా నివాసాల వివరాల ఆన్‌లైన్ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఈఓ రవీంద్రనాథ్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి

'చింత తీరేనా' కథనంపై స్పందించిన అధికారులు


చింతలరేవుపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలను వీడాలని తంబళ్లపల్లె మండలం చింతలరేవుపల్లె గ్రామస్తులకు అధికారులు సూచించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'చింతతీరేనా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ బాపూజీ పట్నాయక్, వైద్య ఆరోగ్య సిబ్బంది గురువారం ఉదయమే చింతలరేవుపల్లెకు చేరుకుని పలువురు గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామీణ ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మకూడదన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వారు గ్రామస్తులకు సూచించారు.

'అభివృద్ధి, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నేత చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. గురువారం తంబళ్లపల్లెలో బీజేపీ మండల నేతలు, కార్యకర్తలతో ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. బూత్ స్థాయి కమిటీలు, శక్తి కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని స్టిక్కర్లను అంటించారు. బీజేపీ మండలాధ్యక్షుడు వెంకట్రమణ, మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గోల్డెన్‌వ్యాలీ రమణా రెడ్డి, గోపాల్‌రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, సుబ్బయ్య, రాఘవరెడ్డి, రామస్వామిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడు రెడ్డి షంషీర్‌కు సన్మానం

మదనపల్లె అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి షంషీర్‌ను, సభ్యులను గురువారం టౌన్‌బ్యాంకులో ఎమ్మెల్యే షాజహాన్‌బాష, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్ సన్మానించారు. ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, కార్యదర్శి మహేష్‌కుమార్, సభ్యులను సన్మానించారు. స్వామీ, రఘుపతి నాయుడు, శివన్న, రవికాంత్, చిన్ని పాల్గొన్నారు.